




బాపట్ల అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు



ఈఆర్‌వోల గుండెల్లో లబ్..డబ్

- నేడు, రేపు విజయవాడలో సీఈసీ, ఈసీలు
- పూర్తి కసరత్తుతో మూడు జిల్లాల అధికారులు
- ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై ఫిర్యాదు చేయనున్న చంద్రబాబు, పవన్
- గుంటూరు పశ్చిమలో జరిగిన అక్రమాలను చంద్రబాబుకు నివేదించిన పార్టీ శ్రేణులు

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ రాజీవ్‌కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు అరుణ్‌గోయల్, అనూప్‌చంద్ర పాండే మంగళవారం నుంచి రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుండటంతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, ఈఆర్‌వోల, బీఎల్‌వోల గుండెల్లో రైళ్లు పరుగెడుతోన్నాయి. సీఈసీ, ఈసీలు రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమై ఇప్పటివరకు ఎస్ఎస్ఆర్-2024కు సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార పురోగతిపై సమీక్షించనున్నారు. అలానే సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత పైనా చర్చించనున్నారు. అలానే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులతోనూ సమావేశమై ఫిర్యాదులు స్వీకరించనున్నారు. సీఈసీనే స్వయంగా హాజరౌతుండటంతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర పార్టీల ముఖ్య నేతలు కూడా హాజరై ఫిర్యాదులు అందజేయాలని నిర్ణయించారు. దీంతో ఎవరిపై సీఈసీ కన్నెర్ర చేస్తారోనని అంతా భయపడిపోతున్నారు.

గుంటూరు జిల్లా ఫాం-7లపై అధికారుల ఉదాసీనం

స్పెషల్ సమ్మరి రివిజన్ - 2024 ప్రారంభమైన తర్వాత గుంటూరు నగరంలో పెద్దసంఖ్యలో బోగస్ ఫారం-7లను వైసీపీ నేతలు వారి అనుచరుల ద్వారా పెట్టించారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేనకు సానుభూతిపరులుగా ఉండే ఓటర్ల పేర్లను లిస్టుల్లో నుంచి తొలగించడమే లక్ష్యంగా గంపగుత్తగా దర ఖాస్తులు చేయించారు. నవంబరు 2 నుంచి 5వ తేదీ మధ్యన దాదాపుగా 2,500లకు పైగా ఓటు తొలగింపు దరఖాస్తులు చేయించారు. ఇవి ఎక్కువగా శేషిరెడ్డి కొండా, శేషిరెడ్డి చల్లా, వెంకాయమ్మ సిద్దే, రాము లన్నల బొతుల, వెంకటరెడ్డి పులుసు, సంజీవరెడ్డి ఆనం పేర్లతో పెట్టించారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నేతలు అభ్యంతరం పెట్టడంతో ఈసీ ఆదేశాల మేరకు రిటర్నింగ్ అధికారి సమక్షంలో విచారణ జరిగింది. విచారణలో తప్పుడు ఫారం-7లను అని తేలినప్పటికీ కఠినమైన సెక్షన్లు పెట్టకుండా బెయి లబుల్ సెక్షన్లు పెట్టి పోలీసు కేసు నమోదు చేయించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 9-8-34లో ధనలక్ష్మి సంగీత విద్యాలయం ఉండగా అక్కడ 60 ఓట్లు చేర్చారు. అలానే 9-1-19లో 85 ఓట్లు ఉంటే టీడీపీ ఫిర్యాదు మేరకు ఇప్పటివరకు 45 మాత్రమే తొలగించారు. కాగా మంత్రి విడదల రజని గుంటూరు పశ్చిమ వైసీపీ సమన్వయకర్తగా నియామకం కావడంతో ఆమె తన ఓటును చిలకలూరిపేట నుంచి బదిలీ చేసుకొనేందుకు తప్పుడు సమాచారంతో ఫారం-8 పెట్టారు. 9-2-98 డోర్ నెంబరులో ఖాళీ స్థలం ఉండగా అక్కడ తాను నివసిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కూడా టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్ల పేర్లను అలానే కొనసాగించారు. వాటిని తుది ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి తొలగి స్తామని అధికారులు చెప్పారు. అయితే ఎన్ని తొలగించారనేది తెలియాల్సి ఉన్నది. డోర్-టూ-డోర్ పరిశీలనలో 27,297 మంది స్థానికంగానే నివాసం ఉంటున్నట్లు తేలింది. దాంతో వారి ఓట్లను తిరిగి ఓటర్ జాబితాలో చేర్చారు. అయితే రాజకీయ పార్టీలు వారి ఓట్ల తొలగింపునకు గతంలో దరఖాస్తులు పెట్టగా వాటిని బీఎల్‌వో, ఏఈఆర్‌వో, ఈఆర్‌వోలు ఆమోదించారు. ఎవరైతే తప్పుడు నిర్ణయాలు తీసుకొన్నారో వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని రాజకీయ పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా నాయకులు ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబుని కలిసి ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం, వైసీపీకి పక్షపాతంగా వ్యవహరిస్తుండటంపై ఫిర్యాదు చేశారు. ఆయా ఆధారాలను చంద్రబాబు మంగళవారం సీఈసీకి ఇవ్వనుండటంతో ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్, కమిషనర్లు వాటిపై ఏవిధమైన చర్యలు తీసుకొంటారోనన్న ఉత్కంఠ నెలకొన్నది.

సోమవారమే విజయవాడకు బాపట్ల కలెక్టర్, ఎస్పీ

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం సాయంత్రమే విజయవాడ బయల్దేరి వెళ్లారు. సీఈవో సమీక్ష ఖరారు అయిన దగ్గర నుంచే జిల్లా అధికారులు దానికి సంబంధించిన నివేదికలను తయారు చేసే పనిలో నిమగ్న మయ్యారు. ఆదివారం ఎస్పీ కార్యాలయం మొత్తం ఇందుకు సంబంధించిన కస రత్తు లోనే నిమగ్న మయి ఉంది. ఇక సోమవారం కలెక్టర్, ఎస్పీ భేటీ కూడా ఇదే అంశం ప్రధాన ఎజెండాగా చర్చసాగింది. సవివర నివేది కలతో కలెక్టర్, ఎస్పీ సీఈవో సమీ క్షకు హాజర వనున్నారు.

పర్చూరుకు సంబంధించే టెన్షన్...

జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలన్నీ సమస్య కాకపోయినా పర్చూరు మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లో ఉండడంతో అందుకు సంబంధించి సీఈవో ఏం అడిగినా జవాబిచ్చేదానికి కావాల్సిన రిపోర్టులన్నీ కలెక్టర్ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా శాంతి భద్రతలకు సంబంధించి ఎస్పీ రిప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉన్నం దున ఆ అంశంపై సమగ్ర నివేదికలతో సిద్ధమై వెళ్లారు.

భోజన విరామం తర్వాత...

బాపట్ల జిల్లాకు సంబంధించి సీఈవోకు ఇచ్చే రిప్రజెంటేషన్ మంగళవారం భోజన విరామం తర్వాత కొన సాగనుంది. బుధ వారం కూడా కొనసాగే సమా వేశంలో సవరణ ప్రక్రియ , ఎన్నికల సన్నద్ధతపై చర్చించనున్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులతో పాటు వాటిపై తీసు కున్న చర్యలు కూడా ప్రధానంగా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

పల్నాడులో ప్రక్షాళనపై ఇంకా సందేహాలే..

హలో.. ఓటు కోసం దర ఖాస్తు చేసుకున్నారా? అయితే సచివాలయానికి రండి అంటూ బీఎల్‌వోల నుంచి దరఖాస్తు దారులకు ఫోన్ కాల్ వస్తుంది. ధ్రువ పత్రాలతో రావలసిందిగా వారు ధరఖాస్తు దారులను ఆదేశిస్తున్నారు. ఫారం -7 విషయంలోనూ ఇదే తంతు. ధరఖాస్తుదారులు సదరు పత్రాలతో సచివాలయానికి వెళ్లకుంటే ఆ వ్యక్తికి ఓటు నమోదు కానట్లే. ఇదీ పల్నాడు జిల్లాలో ఓటర్ల దరఖాస్తుల పరిశీలన తీరు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటుకు సంబంధించి అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్న నిబంధన ఉంది. దీనిని బీఎల్‌వోలు తుంగలో తొక్కుతున్నారు. జిల్లాలో నకిలీ ఓట్లు 18,035 ఉన్నట్లు రాజకీయ పార్టీలు గుర్తించాయి. ఈ మేరకు వీటిని తొలగించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నేతలు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నియోజకవర్గాల వారీగా ఓటరు ఐడెంటీ కార్డు నెంబరు, డోరు నెంబరు కూడా తెలియజేస్తూ వివరాలు అందజేశారు. వీటిని ఈ సారైనా తొలగించేందుకు సదరు అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి. ఒకే ఓటర్లకు రెండు చోట్ల ఓట్లు నమోదయ్యాయి. వీటి విషయంలో అనేక మార్లు ఫిర్యాదులు ఇస్తున్నా అధికారులు స్పందించడంలేదన్న విమర్శలున్నాయి. ఇటువంటి ఓట్లు జిల్లాలో 3,841 ఉన్నట్లు నిర్ధారించారు. వీటిని సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జీరో డోర్ నెంబర్‌లపై జిల్లాలో 5,019 ఓట్లు నమోదయ్యాయి. దాదాపు జిల్లా వ్యాప్తంగా మరణించిన 23,100 మందికి ఓట్లు ఉన్నాయని గుర్తించారు. జాబితాలో వీటిని నమోదు చేసి సంబంధిత అధికారులకు తొలగింపు దర ఖాస్తులు అందజేశారు. ఆయా విషయాలను టీడీపీ శ్రేణులు తమ రాష్ట్ర కార్యాలయానికి పంపారు. వీటిపై ఫిర్యాదు చేయ నున్నట్లు సమాచారం.

తగ్గేదే లే

అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ ఉద్యమంలో వెనకడుగు వేసేది లేదని ఉద్యోగులు తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా ఏమాత్రం తగ్గేదిలేదని తేల్చి చెబుతున్నారు. చెప్పడమే కాదు.. తొలి రోజు చేసి చూపించారు కూడా! ఎస్మా ప్రయోగంపై అధికారులు ఎన్నిరకాలు ఒత్తిళ్లకు గురిచేసినా ఉద్యోగులు మాత్రం తొలిరోజు విధుల్లో చేరలేదు. దీంతో ఎస్మా హెచ్చరికల ప్రభావం మూడు జిల్లాల్లో ఎక్కడా పని చేయలేదని స్పష్టమవుతోంది.

- ఎస్మా ప్రయోగించినా వెనక్కి తగ్గని అంగన్వాడీలు
- తొలిరోజు ప్రభావం చూపని ఎస్మా ఆదేశాలు
- ఒకటి రెండు చోట్ల మినహా అన్ని చోట్లా విధులకు దూరంగానే ఉద్యోగులు
- మిగిలిన అన్నిచోట్లా వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి తప్పని తిప్పలు
- టెంట్లు పీకేస్తామంటూ అధికారుల నుంచి హెచ్చరికలు
- రిలే, ఆమరణ నిరాహార దీక్షల దిశగా సిబ్బంది అడుగులు

బాపట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 5,100 అంగన్వాడీ, మిని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. కిందటి నెల 12వ తేదీ నుంచి ఉద్యోగులు ఆందోళన చేపట్టడంతో అవి మూతపడ్డాయి. తరువాత వాటి తాళాలు పగలకొట్టి వాటి నిర్వహణ బాధ్యతను వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అప్పగించారు. కానీ అది సత్ఫలితాలను ఇవ్వలేదు. వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా తయారయింది. బాలింతలు, గర్భిణులకు వండి పెట్టడం, పోషణ అందజేయడం నామమాత్రంగా మారిపోయింది. గడిచిన నెల రోజులుగా ప్రీ స్కూలు చిన్నారుల హాజరు 20 శాతం కంటే తక్కువగా నమోదవుతోంది. సోమవారం 27 శాతం నమోదయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఉద్యోగులను బలవంతంగానైనా ఆందోళన నుంచి విరమింపజేయాలని ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడానికి సిద్ధమైంది. అయినప్పటికీ ఆ ప్రభావం ఏమాత్రం పనిచేయలేదు.

● ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం

తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను చర్చలకు పిలవకుండా పక్కన పెట్టి సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాలను సోమవారం చర్చలకు పిలవడం ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. తమకు సంఘీభావం ప్రకటించిన సంఘాలను బెదిరించి, సంఘీభావం లేకుండా చేయాలన్న కుట్రతోనే ప్రభుత్వం, అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉద్యోగుల నిరసన శిబిరాలను తొలగిస్తామని అధికారులు హెచ్చరికలు పంపినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. అదేగనుక జరిగితే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు. ఎస్మా ప్రయోగంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. తమ విధులు అత్యవసర సేవల పరిధిలోకి రావని, కోర్టులోనే ఇది తేల్చుకుంటామని చెబుతున్నారు. ఎస్మా ప్రయోగాన్ని నిరసిస్తూ నిరాహార దీక్షలకు సంసిద్ధమవుతున్నారు. ప్రభుత్వం గనుక నిరసన శిబిరాలను తొలగిస్తే అక్కడే రిలే నిరాహార దీక్షలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

● నిరాహార దీక్షలు చేపడతాం: దీప్తి , జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం ఉద్యోగులను బలవంతంగా లొంగదీసుకోవాలని చూస్తోంది. మరో వైపు ఆందోళనా శిబిరాలను పీకేయాలని చూస్తోంది. ఎస్మా ప్రయోగించి ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవాలనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ప్రభుత్వం ఇలానే బెదిరింపులకు దిగితే ఉద్యమం మరింత ఉధృతమవుతుంది. ప్రభుత్వం మా టెంట్లు బలవంతంగా పీకేయాలని చూస్తోంది. అదే జరిగితే అక్కడే నిరాహార దీక్షలకు దిగుతాం.



రేపల్లెలో కళ్లకు గంతలు కట్టుకుని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

● ఉద్యమాన్ని నీరుగార్చే కుట్రలు తగవు: టీ రాధ, గుంటూరు నగర కార్యదర్శి

అంగన్వాడీ ఉద్యోగులకు సరైన పరిష్కారం చూపాలి. కనీసం సరైన రీతిలో చర్చలు కూడా జరపకుండా ప్రభుత్వం నిర్బంధ పద్ధతులు అవలంబిస్తోంది. నిర్బంధం వల్ల ఉద్యమం మరింత ఉధృత మవుతుంది. ఎస్మా పేరు చెప్పి బెదిరిస్తే బెదిరేది లేదు. ఉద్యోగులు ఉద్యమం నుంచి విధుల్లోకి వస్తున్నారని తప్పుడు లెక్కలు చూపడం సిగ్గుచేటు.

● మూడు జిల్లాల్లో 200 కేంద్రాల్లో ఉద్యోగులు

మూడు జిల్లాల్లో 5వేలకు పైగా అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, సోమవారం 200 మంది వరకూ విధులకు హాజరయినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. గుంటూరు నగరంలోనే ఎక్కువమంది విధులకు హాజరయ్యారు. కాగా గ్రామీణ ప్రాంత ఉద్యోగులు మాత్రం పట్టుదలగా ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం గుంటూరు సీడీపీవోలో 127, మంగళగిరిలో 50, పిరంగిపురంలో 5, పొన్నూరులో 13, ప్రత్తిపాడులో 46, తెనాలిలో ఒక అంగన్వాడీ కేంద్రం తెరిచినట్లు అధికారులు చెబుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం చూసుకున్నా గుంటూరు జిల్లాలోని 1482 అంగన్వాడీ కేంద్రాల్లో 240మంది మాత్రమే విధులకు హాజరయ్యారు. అయితే ఈ గణాంకాలు తప్పని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉద్యమాన్ని నీరుగార్చడానికి అధికారులు ఇలాంటి తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఉద్యోగులు అంటున్నారు. ఆందోళన విరమించి విధుల్లో చేరుతున్నారన్న ప్రచారం కల్పించడానికే ఐసీడీఎస్ అధికారులు ఇలా తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

అయినకాడికి.. అమ్ముకుంటున్నారు..!

- అన్నదాతలకు అందని వరి మద్దతు ధర
- బహిరంగ మార్కెట్‌వైపే అన్నదాతల మొగ్గు



బాపట్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వరి మద్దతు ధర ఆర్భాటపు ప్రకటనలకే పరిమితం తప్ప రైతులకు ఒనగూరే ప్రయోజనం గుండుసున్నాగానే కనబడుతోంది. ధాన్యం సేకరణలో ప్రభుత్వం విధిస్తున్న అలవిమాలిన నిబంధనలను భరించలేక అన్నదాతలు అయినకాడికి తమ ధాన్యాన్ని బహిరంగమార్కెట్‌లో అమ్ముకోవడానికే మొగ్గు చూపుతున్నారు. మిచౌంగ్ తుఫాన్ ధాటికి చేతికొచ్చిన పంట దెబ్బతిని రైతాంగం కుదేలైంది. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలులో ఉదారంగా వ్యవహరిస్తామన్న పాలకుల మాటమీద నమ్మకం లేక తమ పంటను బయటే అమ్ముకుని భారీ నష్టాలను అన్నదాతలు చవిచూస్తున్నారు. ఖరీఫ్ కొనుగోళ్లు మొదలై నెలన్నర కావొస్తున్నా ఇప్పటివరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సేకరించిన ధాన్యం కేవలం 5,767 మెట్రిక్ టన్నులే కావడం గమనార్హం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 78,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యాన్ని యంత్రాంగం పెట్టుకుంది. ప్రస్తుతం సేకరణ జరుగుతున్న తీరు పరిశీలిస్తే 25,000 మెట్రిక్ టన్నులకు మించకపోవచ్చనే అంచనాగా ఉంది.

దెబ్బతిన్న ధాన్యం ఒక్క టన్నూ రాలేదు...

మిచౌంగ్ తుఫాన్ విరుచుకుపడినప్పుడు నూర్పుళ్ల మీద ఉన్న ధాన్యం దాదాపు పదివేల మెట్రిక్ టన్నుల వరకు దెబ్బతిని ఉండొచ్చనే అంచనాను యంత్రాగమే వేసింది. ఇదంతా కేంద్రం ఇచ్చిన సడలింపుల్లో భాగంగా రైతుభరోసా కేంద్రాలకు చేరుతుందని లెక్కకట్టారు. కానీ ఇప్పటివరకు మొత్తం సేకరించిందే 5,767 మెట్రిక్ టన్నులయితే అందులో నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించి మద్దతు ధరకు అన్నదాతల దగ్గర నుంచి కొనుగోలు చేసింది శూన్యమని గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి.

వాస్తవానికి మిచౌంగ్ తుఫాన్ ధాటికి కనీసంగా 7,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు అయినా దెబ్బతిని ఉంటుందనేది కచ్చితమైన లెక్కగా ఉంది. కానీ ప్రభుత్వ నిర్ణయాలతో విసిగి వేసారిన అన్నదాతలు మద్దతు ధరపై ఆశలు పెట్టుకోకుండా దళారులనే ఆశ్రయించి నిలువునా దోపిడీకి గురవుతున్నారు. దెబ్బతిన్న ధాన్యంతో పాటు మొత్తం 75,000 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికే బహిరంగ మార్కెట్‌లోని వ్యాపారుల వద్దకు చేరిందనేది అంచనాగా ఉంది

సడలింపులన్నీ పేపర్లమీదనే...

మద్దతు ధరకు కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఇచ్చే మినహాయింపులన్నీ పేపర్లమీదే తప్ప క్షేత్రస్థాయిలో తమకు అందుతున్న దాఖలాలే లేవని వేమూరు మండల రైతు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుభరోసా కేంద్రాల వద్దకు వెళ్లిన తమకు ఏవేవో నిబంధనలనూ.. రేటు విషయంలోనూ కోత వేయడానికి సిద్ధపడుతున్నారని, ఇన్ని అగచాట్లు పడేకంటే బయటే అయిన కాడికి అమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

గతేడాది కన్నా తీసికట్టుగానే....

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యాన్ని అధికారులు పెట్టుకోగా సీజన్ ముగిసేసరికి అది కాస్తా 78,334 టన్నులకే పరిమితమైంది. ఇదే దిగదుడుపు అంటే ఈ ఏడాది ఖరీఫ్ సేకరణ మరింత తీసికట్టుగా ఉండనుంది. ఈఖరీఫ్‌లో సేకరణ లక్ష్యమే 78,000 మెట్రిక్ టన్నులుగా నిర్ధారించారు. ప్రస్తుతం సేకరణ 5,767 మెట్రిక్ టన్నులకు చేరుకుంది. మార్చి చివరి వారం నాటికి ఖరీఫ్ సేకరణ ముగుస్తుంది. మొత్తం 25,000 మెట్రిక్ టన్నుల దగ్గరే ధాన్యం సేకరణ ఆగిపోనుంది. మహా అయితే ఇంకో 5,000 మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉంది తప్ప అంతకుమించి పెరిగే సంకేతాలే కనబడడం లేదు.వాస్తవానికి మిచౌంగ్ వల్ల అధిక పరిమాణంలో వరి దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని దీంతో ప్రభుత్వ అందించే మద్దతు ధర కోసం రైతులంతా క్యూ కడతారని అందరూ భావించారు. కానీ గతంలో అన్నదాతలకు మద్దతు ధర విషయంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఆ కేంద్రాల వైపు చూడడానికే రైతాంగం జంకే పరిస్థితిని ప్రస్తుత పాలకులు తీసుకొచ్చారని రైతు సంఘాలు మండిపడుతున్నాయి.

దిక్సూచి DIKSUCHI

బంధుత్వం ఒక సామాజిక సంస్థ

ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రత్యేకం

ఇండియన్ సొసైటీ

బంధుత్వం(కిన్‌షిప్)

సంస్థ అంటే ఒక క్రమపూర్వకమైన సామాజిక సంబంధాల వ్యవస్థ. సామాజిక ప్రమాణాలు, విలువలపై ఆధారపడిన అవ్యవస్థీకృతమైన సమూహమే సామాజిక సంస్థ. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఒక తరం నుంచి మరో తరం వరకు జాగ్రత్తగా కొనసాగే ప్రామాణిక వ్యవస్థే సామాజిక సంస్థ. ప్రతి సమాజంలోనూ ప్రాథమికంగా ఉండేవి బంధుత్వం, వివాహం, కుటుంబం, మతం, విద్య, ఆర్థిక, రాజకీయ సంస్థలు.



బంధుత్వం: సమాజంలో మానవుడు ఒంటరిగా జీవించలేడు. జన్మించింది మొదలుకొని మరణించే వరకు వ్యక్తి అనేక మందితో సంబంధాన్ని కలిగి ఉంటాడు. సమాజంలో ఉన్న వ్యక్తుల మధ్య ఏదో ఒక రకమైన సంబంధం కొనసాగుతూ ఉంటుంది. అయితే రక్తం లేదా వివాహం ఆధారంగా ఏర్పడే బంధాలు దగ్గరగా ఉంటాయి.

రక్త బంధుత్వం: భార్య, భర్త ఇద్దరికి, వారి సంతానానికి మధ్య ఏర్పడిన పరస్పర బంధాలను 'రక్త బంధుత్వం' అని పిలుస్తారు. ఒకే దంపతులకు పుట్టిన బిడ్డలందరి మధ్య రక్త సంబంధం ఉంటుంది. ఈ సంబంధాన్ని తెలిపేదే 'ఏక రక్త సంబంధం'.

బంధుత్వాలను భిన్న సమాజాలలో భిన్న రీతులుగా అనుసరిస్తున్నారు. ఉదాహరణకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివశిస్తున్న 'తోడా' సమాజంలో స్త్రీ ఒక వ్యక్తితో సంతానం కలిగి...తదనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంటే అతడినే ఆ స్త్రీ పూర్వ సంతానికి కూడా తండ్రిగా అక్కడి సమాజం గుర్తిస్తుంది. ఈ తరహా బంధుత్వాన్ని సామాజిక బంధుత్వం(సోషియాలజికల్ కిన్‌షిప్) అంటారు. సామాజిక బంధుత్వాన్ని మాత్రమే 'వాస్తవ బందుత్వం' అంటారు. ఇటువంటి వాస్తవ బంధుత్వాన్ని బట్టి కూడిన వారిని బంధువులు(కిన్స్) అంటారు.

ద్వితీయ బంధువులు: ఒక వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు, ఆ వ్యక్తికి ద్వితీయ బంధువులు అవుతారు.(భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ తల్లిదండ్రులు-సోదర, సోదరీమణులు ద్వితీయ బంధువులు)

తృతీయ బంధువులు: ఒక వ్యక్తి ద్వితీయ బంధువులకు చెందిన ప్రాథమిక బంధువులు... ఆ వ్యక్తికి తృతీయ బంధువులు అవుతారు.

ఉదా:- భార్య తాలూకు బావ(తోడల్లుడు తృతీయ బంధువు అవుతాడు. మొదటి వ్యక్తి తాలూకు భార్య ప్రాథమిక బంధువు, ఆవిడ అక్క ద్వితీయ బంధువు, అక్క భర్త తృతీయ బంధువు)

వర్గాత్మక వ్యవస్థ: వర్గాత్మక వ్యవస్థలో వివిధ సంబంధీకులు అందరినీ ఒకే వర్గంలో చేర్చడంతోపాటు ఒకే పదంతో వారిని సంబోధిస్తారు. ఉదా:- మామ ఒక వర్గాత్మక పదం.

వర్గాత్మక వ్యవస్థలో బంధువులను సంబోధించే పద్ధతులను బట్టి బంధుత్వ పదాలను మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి.. పదాలు, అన్వయ పదాలు, టెక్నానమీ.

ఎ) సంబోధన పదాలు: ఒక వ్యక్తి తన బంధువులతో సంభాషించేటప్పుడు వాడే పదాలు 'సంబోధన' పదాలు.

ఉదాహరణలు:-

1. ఒక వ్యక్తి తన చెల్లెలితో సంభాషించేటప్పుడు 'సోదరి' అని వాడుతారు.
2. ఒక వ్యక్తి తన తండ్రితో సంభాషించేటప్పుడు 'నాన్న' అని వాడతారు.

బి) అన్వయ పదాలు: ఒక వ్యక్తి మూడో వ్యక్తితో ఒకానొక తన బంధువు గురించి చెప్పేటప్పుడు ఉపయోగించే బంధుత్వ పదమే 'అన్వయ పదం'. ఉదాహరణకు ఒక వ్యక్తి తన నాన్న సోదరుని గురించి మూడో వ్యక్తికి చెప్పినప్పుడు మా 'చిన్నాన్న' అని వర్ణిస్తాడు. అంటే 'చిన్నాన్న' అన్వయ పదం.


వివరణాత్మక పదాలు: రెండు లేదా అంతకన్నా ఎక్కువ ప్రాథమిక పదాలు కలిసినందు వల్ల ఒక కొత్త పదం ఏర్పడినప్పుడు దానిని వివరణాత్మక పదం అంటారు. ఉదాహరణకు నాన్న+అమ్మ=నాన్నమ్మ.

బంధుత్వం ఆచరణలు(కిన్‌షిప్ యూసేజెస్): బంధు సమూహాలలో వ్యక్తుల మధ్య వివిధ రకాలైన బంధుత్వాలు ఉంటాయి. ఒక్కో రకమైన బంధుత్వం ఒక్కో రకమైన ప్రవర్తనను తెలియజేస్తుంది. సమాజం మొతమ్మీద చూస్తే... బంధు సమూహాలలోని వ్యక్తుల మధ్య కొన్ని నిర్దిష్టమైన ప్రవర్తనలు కనిపిస్తాయి. వాటినే బంధుత్వ ఆచరణలు అంటారు. వాటిలో ఆరు ప్రధానమైనవి. అవి... పరిహాస సంబంధాలు, వైదొలుగు నడవడి, మాతులాధికారం, పితృష్వాధికారం, సాంకేతిక సంబోధన, కుహనా ప్రసూతి.



జి.వీరా స్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ.

సైన్స్‌లో పీహెచ్‌డీకి జెస్ట్



సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రెన్స్ స్ర్కీనింగ్ టెస్ట్(జెస్ట్) 2024 నోటిఫికేషన్ వెలువడింది. తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ) దీనిని నిర్వహిస్తోంది. ఈ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది. ఇందులో ఏఆర్‌ఐఈఎస్, బోస్ ఇన్‌స్టిట్యూట్, హెచ్‌బీఎన్‌ఐ, హెచ్‌ఆర్‌ఐ, ఐసీటీఎస్, ఐజీసీఏఆర్, ఐఐఏ, ఐఐఎస్సీ, ఐసర్ సంస్థలు, ఐఐఎస్‌టీ, ఐఎంఎస్సీ, ఐఓపీ, ఐపీఆర్, ఐయూసీఏఏ, జేఎన్‌సీఏఎస్‌ఆర్, ఎన్‌బీఆర్‌సీ, నైసర్, ఎన్‌సీఆర్‌ఏ - టీఐఎఫ్‌ఆర్, పీఆర్‌ఎల్, ఆర్‌ఆర్‌సీఏటీ, ఆర్ఆర్‌ఐ, ఎస్‌ఐఎన్‌పీ, ఎస్‌ఎన్‌బీఎన్‌సీబీఎస్, టీఐఎఫ్ఆర్-టీసీఐఎస్, టీఐఎఫ్‌ఆర్, యూజీసీ-డీఏఈ సీఎస్‌ఆర్, వీఈసీసీ వంటి ప్రధాన సంస్థలు పాల్గొంటున్నాయి. జెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఈ సంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వీటిలో కొన్ని సంస్థలు అందిస్తున్న ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు. ప్రతి సంస్థకూ నిర్దేశిత అర్హత నిబంధనలు ఉన్నాయి. వాటి వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లలో చూడవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత: పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్/ఆస్ట్రానమీ/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/బయోఫిజిక్స్/బయోకెమిస్ట్రీ/ కెమిస్ట్రీ/కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఎంటెక్-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/రేడియో ఫిజిక్స్/మేథమెటిక్స్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఆప్టిక్స్ అండ్ ఫొటోనిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ/పోస్ట్ బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్/బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు, ఎంసీఏ అభ్యర్థులకు కూడా కొన్ని సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులూ అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఆసక్తిగలవారు ఎన్నిసార్లయినా ఈ పరీక్ష రాయవచ్చు.

జెస్ట్ 2024 వివరాలు: ఈ పరీక్షని ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒక విభాగంలో మాత్రమే పరీక్ష రాయాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 15 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి మూడు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో 10 ప్రశ్నలు ఇస్తారు. ఆప్షన్స్ ఇవ్వరు. వీటికి ఒక నెంబరు సమాధానంగా ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. ఈ ప్రశ్నలకు రుణాత్మక మార్కులు లేవు. మూడో పార్ట్‌లో 25 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లాక్/బ్లూ పెన్‌తో గుర్తించాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 24
- **జెస్ట్ 2024 తేదీ:** మార్చి 3
- **వెబ్‌సైట్:** jest.org.in

హైదరాబాద్ నిక్మర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్(నిక్మర్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్‌లు. ఏడాది, రెండేళ్ల వ్యవధి గల ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ అడ్మిషన్ టెస్ట్ (పీజీ ఎన్‌క్యాట్) 2024, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, రేట్ ఆఫ్ అప్లికేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నిర్దేశిత డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ప్రోగ్రామ్‌లో పది శాతం అభ్యర్థులకు నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ అడ్వాన్స్‌డ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో రెగ్యులర్ డిగ్రీ(ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్/మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/అగ్రికల్చర్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్ ఇన్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ(ఇంజనీరింగ్/ ఆర్కిటెక్చర్/ ప్లానింగ్/ కామర్స్/ఫైనాన్స్/బ్యాంకింగ్/ మేనేజ్‌మెంట్/ ఎకనామిక్స్/ మేథమెటిక్స్/ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ఎన్‌క్యాట్ 2024: పరీక్షని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. దీనికి 180 మార్కులు నిర్దేశించారు. ఇందులో క్వాంటిటేటివ్ అండ్ అనలిటికల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 36 మార్కులకు, వెర్బల్ అండ్ జనరల్ ఎబిలిటీ నుంచి 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

- గ్రూప్ డిస్కషన్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు, రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 70 మార్కులు ప్రత్యేకించారు.
- సీయూఈటీ(పీజీ)/క్యాట్/మ్యాట్/ఎక్స్ఏటీ/ఎన్‌మ్యాట్/ఏటీఎంఏ స్కోర్ ఉన్నవారు పీజీ ఎన్‌క్యాట్ 2024 రాయనవసరం లేదు.
- పీజీ ఎన్‌క్యాట్ 2024 స్కోర్‌కు 60 శాతం; గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల స్కోర్లకు 16.67 శాతం; రేటింగ్ ఆఫ్ అప్లికేషన్‌కు 23.33 శాతం వెయిటేజీ ఇస్తారు.

★ **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
★ **వెబ్‌సైట్:** nicmar.ac.in/hyderabad

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KLKVIU1లో చదవండి.

జాబ్ కార్నర్

టీహెచ్‌డీసీలో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు 80

రిషికేశ్ (ఉత్తరాఖండ్)లోని టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్... అప్రెంటిస్‌షిప్‌లో శిక్షణకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్

ట్రేడులు: కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్/సెక్రటేరియల్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్.

అర్హత: 10వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. **దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 24

వెబ్‌సైట్: https://thdc.co.in/

మద్రాస్ ఐఐటి, డేకిన్ వర్సిటీ ఉమ్మడిగా

రీసెర్చ్ అకాడమీ

మద్రాస్ ఐఐటీ, ఆస్ట్రేలియాకు చెందిన డేకిన్ యూనివర్సిటీ కలిసి ఉమ్మడిగా రీసెర్చ్ అకాడమీని ఆరంభించాయి. 'ఐఐటీ మద్రాస్ డేకిన్ యూనివర్సిటీ రీసెర్చ్ అకాడమీ'గా మలిచారు. ఉమ్మడి పర్యవేక్షణ, మెరిటోరియస్ స్కాలర్‌షిప్స్‌తో గ్లోబల్ రీసెర్చ్‌కు శ్రీకారం చుట్టారు. సార్క్ అలాగే ఆసియన్ దేశాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్లు - ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే దిశగా పరిశోధనలు చేస్తారని మద్రాస్ ఐఐటీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. క్లీన్ ఎనర్జీ, క్రిటికల్ టెక్నాలజీస్, క్లయిమేట్ చేంజ్, హెల్త్‌కేర్ టెక్నాలజీస్ తదితరాలకు ప్రాధాన్యం ఇస్తారు. రెండు విశిష్ట సంస్థలు ఉమ్మడిగా నాలుగేళ్ల పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఆఫర్ చేస్తాయి. ఇందులో భాగంగా ముప్పయ్ స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. తమ పరిశోధకులకు ఇచ్చేందుకు డేకిన్ వర్సిటీ పది, ఐఐటీ మద్రాస్ ఇరవై స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేశాయి.


వెబ్‌సైట్స్: https:// www.iitm.ac.in/ www.deakin.edu.au/



తాట తీస్తా..

'నేను కష్టపడి ఈ స్థాయికి వచ్చాననేమో.. ప్రతి ఏడాది సంక్రాంతి వస్తే చాలు.. ఏదో ఒక వివాదాన్ని లేవనెత్తుతూ నాపై ట్రోల్స్ చేయడం కొన్ని వెబ్‌సైట్స్‌కి పరిపాటైపోయింది. ఏడెనిమిదేళ్ల నుంచి ఇదే తంతు. నిన్నటి 'హను-మాన్' ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో చిరంజీగారు ఈ థియేటర్ల వ్యవహారంపై ఎంతో పాజిటీవ్‌గా మాట్లాడారు. 'సమస్యను ఎలా పరిష్కరించాలో దిల్‌రాజుకి తెలుసు.. ఈ విషయాల్లో తనకు అనుభవం ఉంది' అంటూ నా గురించి కూడా గౌరవంగా స్పందించారు. ఆ మాటల్ని వేరే విధంగా మార్చి రెండు ప్రముఖ వెబ్‌సైట్లు పిచ్చి రాతాలు రాశాయ్. మీ వెబ్‌సైట్ రేటింగ్ పెంచుకోవటానికి వేరే వాళ్లను ఎందుకు బలి చేస్తున్నారు? అంటే దిల్ రాజు ఏం రియాక్టవ్వడు, సర్దుకుని పోతాడు అనుకుంటున్నారా? తాట తీస్తా..' అంటూ ప్రముఖ నిర్మాత దిల్ రాజు హెచ్చరిక జారీ చేశారు. తన గురించి అవాస్తవాలు రాశారంటూ.. రెండు వెబ్‌సైట్లపై(ఆంధ్రజ్యోతి కాదు) దిల్‌రాజు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. వెన్నెల కిశోర్, అనన్య నాగళ్ల జంటగా రూపొందుతోన్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్స్'. రచయిత గోపీ మోహన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వి.రమణారెడ్డి నిర్మాత. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని సోమవారం హైదరాబాద్‌లో దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్ రాజు మాట్లాడారు. 'చాలా రోజులుగా ఓపిక పడుతూ వచ్చాను. నా వల్ల ఇబ్బంది పడుతున్నట్టు ఏ ప్రొడ్యూసరైనా మీకు చెప్పాడా? దమ్ముంటే ఆ ప్రొడ్యూసర్‌నీ నన్నూ ఒక వేదికపై కూర్చోబెట్టి ప్రశ్నించండి. వ్యాపారపరంగా వచ్చే సమస్యల్ని అడ్వాంటేజ్‌గా తీసుకొని నన్ను బ్లేమ్ చేయడానికి వెబ్‌సైట్లనీ, యూట్యూబ్ ఛానల్స్‌ని కొందరు వాడుకుంటున్నారు. సంక్రాంతి రిలీజ్‌ల గురించి ఛాంబర్‌లో మీటింగ్ పెట్టాం. థియేటర్ల కొరత రాకూడదని నిర్మాతను రిక్వెస్ట్ చేసి రవితేజగారి సినిమాను సంక్రాంతి నుంచి పక్కకు జరిపాం. ఇది ఎంత కష్టమైన పనో తెలుసా?.. ఇంకోడెవడో రాశాడు. 'దిల్ రాజు తమిళ సినిమాను సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాడు' అని. ఎవడు చెప్పాడ్రా.. నేను రిలీజ్ చేస్తున్నానని? నీ దగ్గర రుజువు ఉందా? ఆ తమిళ సినిమా రిలీజ్‌ను వాయిదా వేయించిందే నేను. విషయం తెలియకుండా అబద్ధాలు ఎందుకు రాస్తారు? మళ్లీ చెబుతున్నా.. తేలిగ్గా తీసుకోకండి.. ఇక నుంచి నా గురించి అబద్ధాలు రాసి, కాంట్రవర్సీలు క్రియేట్ చేస్తే ఊరుకోను., తాటతీస్తా..' అంటూ ఉద్వేగంగా స్పందించారు దిల్‌రాజు.

'నా సామిరంగ' మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుంది




కీరవాణి

'నాగార్జునకు సరిగ్గా సరిపోయే టైటిల్ 'నా సామిరంగ. 32ఏళ్ల క్రితం నాగార్జునతో నేను చేసిన 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' ఎంతటి విజయాన్ని సాధించిందో.. సంక్రాంతికి రానున్న 'నా సామిరంగ కూడా అంతటి విజయాన్ని సాధిస్తుందని నా నమ్మకం. 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' పల్లెటూరి నేపథ్యంతో కూడిన వినోదాత్మక చిత్రం. 'నా సామిరంగ కూడా సేమ్ టు సేమ్. కాబట్టి ఇది మరో 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం' అవుతుందని ఆశిస్తున్నా.' అని ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి అన్నారు. అక్కినేని నాగార్జున హీరోగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన చిత్రం 'నా సామిరంగ'. కీరవాణి స్వరాలందించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా కీరవాణి విలేకరులతో మాట్లాడారు. ' రీరికార్డింగ్ సమయంలో ఓ సందర్భం పాట రాయాలనే ఆలోచనకు దోహదం చేసింది. దాంతో ఇందులో ఓ పాట రాశాను. ఈ సినిమాలో సంగీతం స్వచ్ఛంగా ఉంటుంది. క్వాలిటీ తగ్గకుండా వేగంగా సినిమా తీయగలగడం దర్శకుడు విజయ్ బిన్నీ ప్రత్యేకత. అతను స్వతహాగా డాన్స్ మాస్టర్. కాబట్టి డాన్స్‌ను దృష్టిలో పెట్టుకొని ట్యూన్స్ తీసుకుంటాడనుకున్నాను. కానీ అద్భుతమైన మూడు మెలోడీస్‌ని నా నుంచి తీసుకున్నాడు. దర్శకుడిగా అతనిలోని పరిపక్వత నాకప్పుడు అర్థమైంది' అని కీరవాణి అన్నారు. ఇటీవలి సినిమాల్లో జైలర్, యానిమల్ చిత్రాల సంగీతం బావుందని ఆయన చెప్పారు. 'హరిహరవీరమల్లు' సినిమాకు సంబంధించిన మూడు పాటల రీకార్డింగ్ పూర్తయిందని, అలాగే, చిరంజీవి 'విశ్వంభర' మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలయ్యాయని అన్నారు. రాజమౌళి సినిమాకు సంబంధించిన మ్యూజిక్ పనులు ఇంకా మొదలవ్వలేదని కీరవాణి తెలిపారు.

నవ్య | చిత్రజ్యోతి

కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది



'ఈ సముద్రం చేపలకంటే కత్తులూ, నెత్తురే ఎక్కువ చూసి ఉండాది. అందుకే దీన్ని ఎర్రసముద్రం అంటారు' అంటున్నారు ఎన్టీఆర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'దేవర' చిత్రంలోనిదీ డైలాగ్. కొరటాల శివ దర్శకుడు. సోమవారం చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. రోమాంచిత పోరాట ఘట్టాలు, పతాక స్థాయి భావోద్వేగాలతో గ్లింప్స్ ఆద్యంతం అలరించింది. ఆగ్రహం నిండిన కళ్లతో ఎన్టీఆర్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. సముద్రపు దొంగలు నౌకలను దోచుకోవడం, వారిని ఎన్టీఆర్ ఊచకోత కోసే సన్నివేశాలతో యాక్షన్ హంగామా కనిపించింది. అనిరుధ్ రవిచంద్రన్ ఇచ్చిన నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 5న 'దేవర' చిత్రం తొలిభాగం విడుదలవుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, మురళీశర్మ కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

దర్శకుడు కే జయదేవ్ కన్నుమూత



సీనియర్ జర్నలిస్ట్, సినీ దర్శకుడు కే జయదేవ్ కన్నుమూశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జయదేవ్ దర్శకత్వం వహించిన 'కోరంగి నుంచి' చిత్రం పలు జాతీయ, అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. భారతరత్న సీఎస్‌ఆర్ రావుపై ఫిల్మ్స్ డివిజన్‌కు ఆయన డాక్యుమెంటరీ నిర్మించారు. ప్రముఖ దర్శకుడు, జర్నలిస్ట్ కెఎన్‌టి శాస్త్రికి జయదేవ్ చిన్న కుమారుడు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WwIRX55 లో చదవండి.

సీఎం రివర్స్ పాలన మాకొద్దు

● అభివృద్ధిలో దూసుకుపోయే నాయకుడు కావాలి ● 1483వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 8: సీఎం జగన్‌రెడ్డి రివర్స్ పాలన మాకొద్దు అని అభివృద్ధిలో ముందుకు దూసుకుపోయే నాయకుడు కావాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ, రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1483వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి పలువురు రైతులు మహిళలు మాట్లాడుతూ, మూడు రాజధానుల ప్రతిపాదన పెట్టి రాష్ట్రాభివృద్ధి లేకుండా చేస్తున్నారన్నారు. ఐదుకోట్ల మంది కోరుకునే అమరావతి రాష్ట్రం నడి బొడ్డులో ఉందన్నారు. అన్ని సౌకర్యాలతో అభివృద్ధి పనులు కొనసాగుతుంటే సీఎం జగన్‌రెడ్డి వచ్చి బ్రేక్ వేశాడన్నారు. అమరావతిని నిర్వీర్యం చేయటం అంటే శత్రువులు వచ్చి అభివృద్ధిని అడ్డుకున్నట్టు ఉందన్నారు. పాలన చేతకాకపోతే దిగిపోవాలన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేయటం దుర్మార్గమన్నారు. వేల ఎకరాలుండి కూడా రాజధాని నిర్మాణం కొనసాగించలేక పోవటం రాజకీయ దురుద్దేశమన్నారు. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తామని ప్రతిజ్ఞ చేసి మాట తప్పారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి, అభివృద్ధి పనులు కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెలగపూడి, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, ఉద్దండ్రాయునిపాలెం తదితర రైతు ధర్నా శిబిరాలలో ఆందోళనలు కొనసాగాయి.


బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

వైసీపీకి ఓటమి భయం

● రాష్ట్రంలో సంక్షేమం పేరుతో దోపిడీ
● మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

తెనాలి రూరల్, జనవరి 8: నీరో చక్రవర్తిగా మారిన జగన్ పాలను గద్దెదించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. సోమవారం తెనాలిలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తలపెట్టిన ప్రజాయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆనందబాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని జగన్ అప్పుల పాలు చేస్తూ ప్రజలకు సంక్షేమం అంటూ సంక్షోభ పాలనకు తెరలేపారని విమర్శించారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేసి అన్నగా మహిళలకు అండగా నిలుస్తానని చెప్పిన జగన్ మద్యం షాపులు పెంచి ఏరులై పారిస్తున్నారని ఆక్షేపించారు. చరిత్రలో పేదవాడి సంక్షేమం పేరుతో ఇంత పెద్దమొత్తంలో దోచుకోవచ్చని ఈ ప్రభుత్వం నిరూపించిందని విమర్శించారు. చంద్రబాబు అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు నడిపారని, చంద్రబాబు సీఎంగా తాను మంత్రిగా 5600కిలోమీటర్ల మేర గ్రామాల్లో పట్టణాల్లో రోడ్లువేసి అభివృద్ధి చేశామని చెప్పారు. జగన్ పాలనలో ఒక్క కిలోమీటరైనా రోడ్డు వేయగలిగారా అని ప్రశ్నించారు. దళితులకు అందించాల్సిన నిధులను కూడా పక్కదోవ పట్టించిన జగన్ ప్రభుత్వం నా ఎస్సీలు, నాఎస్టీలూ అంటూ దీర్ఘంతీస్తూ లేని ప్రేమను వలకబోయడం తప్ప ఇంకేం చేయగలరని ఎద్దేవా చేశారు. ప్రజలను వంచించిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. జగన్‌కు, వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని ఉద్యోగులు నిరసన చేస్తుంటే చర్చలకు రమ్మని కబురుపెట్టే సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణలు వారితో ఏం మాట్లాడతారో అర్థమయ్యే పరిస్థితి కూడా లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబును గెలిపించుకుందామని ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ కలిసి తెలుగుదేశం జనసేన ఉమ్మడి నాయకత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

రైతులు, యువత నోట్లో మట్టికొట్టిన జగన్‌రెడ్డి ప్రభుత్వం

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 8: నమ్మి ఓట్లువేసిన పాపానికి జగన్‌రెడ్డి రైతాంగం, యువతరం నోట్లో మట్టికొట్టారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. ఒక్క వ్యక్తి వల్ల ఒక రాష్ట్రం, ఒక తరం ఇంతగా నష్టపోయిన సందర్భం రాష్ట్రంలో, దేశంలో ఎప్పుడూ, ఎక్కడా లేదన్నారు. చిలకలూరిపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ దగా పడిన ధాన్యం రైతుల ఆక్రందనలు, రోడ్డున పడిన ఉద్యాన, వాణిజ్య పంటల రైతుల ఆక్రోశాలే జగన్ అసమర్థ పాలనకు నిదర్శనం అన్నారు. మెగా డీఎస్సీ లేదు, ఏటా జాబ్ క్యాలెండర్లు లేవు, భర్తీ చేస్తామన్న 2.3 లక్షల ఉద్యోగాలూ లేవన్నారు. ప్రైవేట్‌రంగంలోనైనా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చూసుకుందామంటే ఈ సైకో పాలనలో పెట్టుబడులు, పరిశ్రమలు పారిపోయేలా చేశారన్నారు. వీటి ఫలితంగా నిరుద్యోగంలో రాష్ట్రాన్ని దేశంలో నెంబరు 1 స్థానంలో నిలిపారని ప్రత్తిపాటి వాపోయారు. విధ్వంసం తప్ప సంపద సృష్టి అన్న మాటే లేదన్నారు. రానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రాధాన్యాలు కానున్నాయన్నారు.

పొందుగల చెక్‌పోస్టు వద్ద రూ.12.50 లక్షల నగదు స్వాధీనం

దాచేపల్లి, జనవరి 8: రాష్ట్ర పోలీస్ చెక్‌పోస్టు పొందుగల వద్ద ఎటువంటి ఆధారాలు లేని రూ.12లక్షల 50వేల నగదును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో పొందుగల పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారును తనిఖీ చేయగా అందులో 12 లక్షల 50 వేల రూపాయల నగదు వుండటాన్ని గుర్తించారు. హైదరాబాద్‌లోని షాద్‌నగర్‌కు చెందిన వైకుంఠ మధుసూదనరావుకు చెందిన నగదుగా గుర్తించారు. అతనివద్ద ఎటువంటి బిల్లులు, రసీదులు లేకపోవడంతో పోలీసులు ఆ నగదును స్వాధీనం చేసుకొని ఇన్‌కంట్యాక్స్ అధికారులకు స్వాధీనం చేశారు.

జగన్ నిర్వాకం వల్ల రాష్ట్రం అదోగతి

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి 8: ఓ వ్యక్తి వల్ల ఒక రాష్ట్రం... ఒక తరం... కోట్లాది మంది ప్రజలు ఎంతో నష్టపోతున్న సందర్భం దేశంలో మన రాష్ట్రం తప్ప ఎక్కడా లేదని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభించిన జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్నివిధాల కూల్చివేశాడని తెలిపారు. వ్యవసాయశాఖను నిర్వీర్యం చేశారన్నారు. ఉద్యానవనశాఖ ద్వారా పంట నష్టపోయిన ఏ ఒక్క రైతు కూడా పరిహారం పొందిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో కౌలురైతు ఆత్మహత్యలలో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానం, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానం, రైతు అప్పుల్లో మొదటిస్థానంకు తెచ్చిన ఘనుడు సీఎం జగన్ అన్నారు. పల్నాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేవు... డ్రిప్ ఇరిగేషన్‌కు రాయితీలే రావడం లేదు... మద్దతు ధర అందని ద్రాక్షలా ఉందన్నారు. రివర్స్ టెండరింగ్‌ల పేరుతో ఇరిగేషన్ ప్రాజెక్టులను నాశనం చేశాడన్నారు. పట్టిసీమ పెడితే చంద్రబాబుపై కోపంతో దానిని పట్టించుకోవడం మానేశాడన్నారు. పోలవరం కూడా అదే దుస్థితిలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం దిగేంతవరకు పనులు చేయడం మావల్ల కాదంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. జాబ్ క్యాలెండర్ లేదు.. డీఎస్సీ లేదు.. వచ్చిన పరిశ్రమలను కూడా భయపెట్టి పక్క రాష్ట్రాలకు పారిపోయేలా చేస్తున్నారన్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగమే లేకుండా చేశారన్నారు. రేపటి ఎన్నికలలో జగన్‌ను ఇంటికి సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా వున్నారన్నారు. మరో మూడు నెలల్లో అమరావతే ప్రజారాజధానిగా మారనున్నదని యరపతినేని తెలిపారు.

పాలిటెక్నిక్ లెక్చరర్లకు సాంకేతిక అంశాల్లో సమగ్ర శిక్షణ

ఏపీ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి


ప్రసంగిస్తున్న ఏపీ సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి

మంగళగిరి సిటీ, జనవరి 8: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధే లక్ష్యంగా వివిధ సంస్కరణలు చేపడుతున్నామని, అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడంతోపాటు లెక్చరర్లకు సాంకేతిక అంశాల్లో సమగ్ర శిక్షణ ఇస్తున్నామని ఏపీ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సీ నాగరాణి చెప్పారు. మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఆరు రోజులపాటు జరుగనున్న పాలిటెక్నిక్ లెక్చరర్ల శిక్షణా తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కమిషనర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగివున్న మేథాశక్తిని వెలికితీయాల్సిన బాధ్యత లెక్చరర్లదే అన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా మాట్లాడుతూ టీచర్లు, విద్యార్థుల నడుమ సరైన అవగాహన వుండాలన్నారు. సాంకేతికపరమైన అన్ని విషయాల్లోనూ పాలిటెక్నిక్ లెక్చరర్లు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. శిక్షణాపరంగా అవసరమైన సహకారాన్ని ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ అందిస్తుందని తెలిపారు. అనంతరం టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెన్నయ్‌కు చెందిన ఎన్‌ఐటీటీటీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్రరావు, సంయుక్త సంచాలకులు వి.పద్మారావు, డీడీలు నాగేశ్వరరావు, ఎంఏవీ రామకృష్ణ, ప్రొఫెసర్ బాలగురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల నుంచి 128 మంది లెక్చరర్లు తరగతులకు హాజరయ్యారు.

దోపిడీ, సంపాదనే ధ్యేయంగా పాలన

ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

సత్తెనపల్లి, జనవరి 8: ముఖ్యమంత్రి జగన్ అధి కా రంలోకి వచ్చాక దోపిడీ, సంపాదనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. సోమవారం సత్తెనపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోల్పోతున్నామని తెలిసినా వైసీపీ మంత్రులు, ముఖ్యమంత్రి పెద్దఎత్తున వసూళ్ళకు పాల్పడుతున్నారన్నారు. జగన్ సీఎం కాలేదని, ఆ పార్టీ చిత్తుచిత్తుగా ఓడి పోతుందన్నారు. శవాలపై పేలాలు ఏరుకున్నట్టు పెద్దఎత్తున రాష్ట్రంలో వసూళ్ళకు పాల్పడుతున్నారన్నారు. స్థానిక మంత్రి రైతు సమస్యలపై స్పందించడన్నారు. ఇన్సూరెన్స్ డబ్బుల్లో కమీషన్ కోసం మంత్రి కక్కుర్తి పడ్డారన్నారు. పంట పొలాలకు నీరు ఇవ్వలేని పరిస్థితుల్లో మంత్రి ఉన్నారన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని మంత్రి అంబటి సంక్రాంతి సంబరాల పేరిట నియోజకవర్గంలో లాటరీ టిక్కెట్లు అమ్మిస్తున్నారన్నారు. పెన్షన్‌దారులకు సైతం లాటరీ టిక్కెట్‌లు అంటగడుతున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పటం ఖాయన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు తాతా జయప్రకాష్ నారాయణ, మక్కపాటి రామచంద్రరరావు, బండారు నాగరాజు, గుంటూరు ఆశీర్వాదం, అప్పారావు తదితరులు ఉన్నారు.

కౌలు చెల్లించాలని సీఆర్డీఏ కార్యాలయం ముందు ధర్నా

తుళ్లూరు, జనవరి 8: రాజధాని అమరావతి నిర్మాణానికి 33 వేల ఎకరాలు భూములిచ్చిన రైతులకు జీవనోపాధి పోతుందని పది సంవత్సరాలు కౌలు చెల్లించేలా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకొని ప్రతి ఏడాది మేలో కౌలు చెల్లిస్తూ వచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అమరావతి నిర్మాణ పనులు నిలిపివేయటంతో పాటు వార్షిక కౌలు చెల్లింపులో జాప్యం చేస్తోంది. ఎప్పటికప్పుడు కౌలు కోసం రైతులు రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది మే నెలలో వేయాల్సిన కౌలును ఇంతవరకు జమ చేయలేదు. దీంతో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయం ముందు రాజధాని గ్రామాల రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా నిర్వహించారు. రైతు కూలీలకు ఇచ్చే పింఛన్‌ను రూ.5వేలకు పెంచి ఇస్తామని సీఎం జగన్‌రెడ్డి ఎన్నికల ముందు హామీనిచ్చారు. అది కూడా నెరవేర్చలేదని వారు పేర్కొన్నారు. తొలుత సీపీఐ రాష్ట్ర నేతలు రామకృష్ణ, ముప్పాళ్ళ నాగేశ్వరావు, రైతులు, మహిళలు, రైతు కూలీలు రాజధాని అమరావతిలో సమస్యలు పరిష్కరించాలని సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ అలీంబాషకు వినతిపత్రం అందజేశారు. తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేరని, రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఇబ్బంది కలుగుతోందని జేఏసీ నేతలు అదనపు కమిషనర్‌కు విన్నవించారు. సాధ్యమైనంతవరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన రైతులకు హామీనిచ్చారు. తదనంతరం సీఆర్డీఏ కార్యాలయం ముందు కౌలు చెల్లించాలని ధర్నా చేశారు.


విజయవాడ సీఆర్డీఏ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రాజధాని రైతులు, మహిళలు, రైతు కూలీలు

నేడు పెదకాకాని సమీపంలో గుంటూరు కారం సినిమా ఆడియో ఫంక్షన్


ఆడియో ఫంక్షన్ నిర్వహణకు సిద్ధమవుతున్న వేదిక

పెదకాకాని, జనవరి 8 : ప్రిన్స్ మహేష్‌బాబు నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ ఆడియో రిలీజ్ ఫంక్షన్‌కు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలోని నంబూరు అడ్డరోడ్డు వద్ద ఈ సినిమా ప్రీ ఆడియో రిలీజ్ ఫంక్షన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఈ ఫంక్షన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హారిక హాసిన్ బ్యానర్‌పై నిర్మాత రాధాకృష్ణ(చిన్నబాబు), దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సారథ్యంలో సూపర్‌స్టార్ మహేష్ బాబు, అందాల భామ శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ రిలీజ్ ఆడియో ఫంక్షన్ పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ఈ సినిమాలో నటించిన మీనాక్షి చౌదరి, రమ్యకృష్ణ, ప్రకాష్‌రాజ్, రావు రమేష్ తదితరులు ఈ వేడుకకు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధులు


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 8: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీని సోమవారం న్యూఢిల్లీలో గల ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులు సందర్శించారు. ముందుగా ఎంబసీ ఆఫ్ జపాన్ ప్రతినిధులైన కౌన్సిలర్ కెంటారో ఒరిటా, సెకండ్ సెక్రటరీ రైతా సైటో, అడ్మినిస్ట్రేటివ్ అటాచీ రికుతో ఐటోలకు విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణం ఘన స్వాగతం పలికారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జపాన్ లాంగ్వేజ్ సెంటర్ ఏర్పాటుచేయాలని జపాన్ ప్రతినిధులను కోరారు.

ఉమ్మడి జిల్లాలో పార్లమెంటు నియోజకవర్గాల కాంగ్రెస్ కోఆర్డినేటర్‌ల నియామకం

● గుంటూరు పార్లమెంట్‌కు ఉమాశంకర్

గుంటూరు, జనవరి 8: ఉమ్మడి జిల్లాలోని మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌లను ఏఐసీసీ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లోక్‌సభ స్థానాలకు కోఆర్డినేటర్‌లను నియమిస్తూ ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గానికి కృష్ణా జిల్లాకు చెందిన న్యాయవాది, ఆ పార్టీ నేత గంగిశెట్టి ఉమాశంకర్, నరసరావుపేట పార్లమెంటుకు విజయవాడకు చెందిన న్యాయవాది, ఏపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వీ గురునాథం, బాపట్ల ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంటు నియోజకవర్గానికి ఒంగోలుకు చెందిన శ్రీపతి ప్రకాశంను నియమించారు. నగరానికి చెందిన ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్‌ను మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి కో ఆర్డినేటర్‌గా నియమించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో సీనియర్ నేతలను పార్లమెంటు నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా నియమించటం జరిగిందని ఆ పార్టీ నేతలు తెలిపారు.

20న రాష్ట్ర జూనియర్ బాలబాలికల క్యారమ్స్ జట్ల ఎంపిక

గుంటూరు(తూర్పు), జనవరి 8: ఆంధ్రా స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజయవాడ, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 20వ తేదీన రాష్ట్ర జూనియర్ బాలబాలికల క్యారమ్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రధానకార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు బాలబాలికలు అయితే 2006 తరువాత, యువతీ, యువకులైతే 2003 తరువాత పుట్టినవారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 91774 79119 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఆర్వీఆర్ జేసీకి పరిశోధనలో అరుదైన పురస్కారం


అధ్యాపకుల్ని అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 8: స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల పరిశోధన విభాగానికి ఏఐసీటీఈ నుంచి పురస్కారం లభించినట్లు కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, భారత ప్రభుత్వ ఇన్నోవేషన్ సెల్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఏఐసీటీఈల సంయుక్త ఆధ్వర్యంలో కేఎల్ యూనివర్సిటీలో జరిగిన "ఇన్నోవేటివ్ భరత్ - ఐఐసీ రీజినల్ మీట్-2023"లో ఆవిష్కరణలు ప్రదర్శించారు. ఇందులో కళాశాల బృందం ప్రదర్శించిన "నానోఫైబ్రోస్ డ్రెస్సింగ్"కు ప్రథమ బహుమతి లభించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు సోమవారం ప్రశంసా పత్రాన్ని అందించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

10న ఇండో ఇజ్రాయేల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

● పల్నాడు రైతాంగం తరలి రావాలి
● ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు

నకరికల్లు, జనవరి 8: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో ఈ నెల 10వ తేదీన వ్యవసాయరంగంలో ప్రతిష్ఠాత్మకమైన ఇండో ఇజ్రాయేల్ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి పల్నాడు ప్రాంత రైతులు తరలి రావాలని నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు సోమవారం ఓ ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో నాణ్యమైన ఆహార ఉత్పత్తుల దిగుబడికి, ఎగుమతులకు, రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు నూతన వంగడాల వ్యాప్తికి కేంద్రంగా వ్యవహరించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో ఏర్పాటయ్యే ల్యాబ్‌ల నిర్మాణాల ను చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు.

నూతన భవన సముదాయానికి రూ.6లక్షల విరాళం


పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దాతలు

గుంటూరు(తూర్పు), జనవరి 8: జేకేసీ రోడ్డులోని కమ్మజనసేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవనసముదాయంలో ఒక గది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.6లక్షలను విరాళంగా కీర్తిశేషులు ముప్పాళ్ల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు ప్రకటించారు. ఈ మేరకు బృందావన్‌గార్డెన్‌లోని బాలికల వసతిగృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఆయన కుటుంబసభ్యులు కస్తూరి, నిమ్మగడ్డ పద్మజ, విద్యాసాగర్, ఆకాష్ సాయిశ్రీ, శ్రీఅన్వేష్ కలసి చెక్కును అందజేశారు. అనంతరం సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ముప్పాళ్ల సుబ్బారావు కుటుంబసభ్యులు గతంలో ఒక గది నిర్మాణానికి అవసరమైన నిధులు ఇచ్చారని, మరో గదికి విరాళం ఇవ్వడం హర్షణీయమన్నారు. రెండు సంవత్సరాల్లో నూతన భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి గోరంట్ల పున్నయ్యచౌదరి, ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, పాలకవర్గసభ్యులు పెద్ది సాంబశివరావు, వడ్లమూడి శివసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

పంచ సూత్రాలపై మహిళలకు శిక్షణ ఇవ్వాలి



సమీక్షలో మాట్లాడుతున్న మెప్మా సంచాలకులు విజయలక్ష్మి

గుంటూరు సిటీ, జనవరి 8: మహిళల ఆర్థిక అభ్యున్నతికి పంచ సూత్రాలు పాటించేలా వారికి శిక్షణ ఇప్పించాలని, ప్రతి మహిళా సంఘం బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మెప్మా సంచాలకులు వి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం గుంటూరు జడ్పీ మీటింగ్ హాల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్టీఆర్, ప్రకాశం, వెస్ట్‌గోదావరి, ఏలూరు జిల్లాలకు సంబంధించిన మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాలపై ప్రాంతీయ సమీక్ష నిర్వహించారు. జీవనోపాధి మెరుగుపడేలా స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) సభ్యులకు శిక్షణ ఇవ్వాలని విజయలక్ష్మి సూచించారు. పట్టణాలలో మహిళా మార్ట్‌లు, జగనన్న ఈమార్ట్‌లు, పట్టణ ప్రగతియూనిట్‌లు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు అనేకమైనవి ఏర్పాటుచేయడం జరిగిందని, వాటిని డ్వాక్రా మహిళలే నిర్వహించుకొనేలా శిక్షణను అందించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వెంకటనారాయణ, వెస్ట్ గోదావరి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇమ్మాన్యుయేల్, ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్, రామాంజనేయులు, సబ్జెక్టు స్పెషలిస్టులు, స్టేట్ మిషన్ మేనేజర్లు, సిటీ మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

నల్గొండ నుంచి గుంటూరుకు అక్రమంగా మద్యం రవాణా

● 165 మద్యం బాటిళ్లు స్వాధీనం, నిందితుడి అరెస్ట్
● ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 8: తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ నుండి గుంటూరుకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సోమవారం ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. గుంటూరు అమరావతి రోడ్‌లోని నగరాలకు చెందిన పాలెం రామ్మోహనరావు నల్గొండలో 165 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి గుంటూరు తీసుకొచ్చారు. నగరాల్లోని పట్టాభిసీతారామయ్యనగర్ రెండో లైనులో ఉంచినట్లు సెబ్ అధికారులకు అందిన సమాచారం మేరకు నిందితుడిని అదుపులో తీసుకొని మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుని అరెస్ట్‌చేసి కోర్టు హాజరు పరిచినట్లు అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ కర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పిడుగురాళ్ల, జనవరి 8: పట్టణంలోని క్రోసూరు బస్టాండ్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనంకి గ్రామానికి చెందిన బండారు వాసు (18) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగత పనుల మీద కోనంకి గ్రామం నుంచి పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ మీదుగా సినిమాహాలు సెంటర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో క్రోసూరు బస్టాండ్ సమీపంలోకి రాగానే మరో రెండు బైకులు పక్కగా వచ్చాయి. వాసు నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన చికిత్సకు గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	83, 98, 105
చికెన్ విత్ స్కిన్	170.00
చికెన్ స్కిన్ లెస్	180.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



కార్మికులకు మోటార్ మగ్గాలు అందిస్తున్న ఎంపీ మోపిదేవి, ఇన్‌చార్జ్ గణేష్

చేనేత కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

● రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె, జనవరి 8: చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. సోమవారం మండలంలోని పేటేరు గ్రామంలో చేనేత కార్మికులకు మోటార్ మగ్గాలను అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ మోపిదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్మికులకు మోటారు మగ్గాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేతివృత్తుల మీద ఆదారపడి జీవించే బీసీ సామాజిక వర్గాలకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. మారుతున్న కాలానుగుణంగా చేనేత రంగాన్ని కూడా అభివృద్ధి చేస్తూ చేనేత కార్మికులకు అండగా ముఖ్యమంత్రి నిలిచారన్నారు. కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్, దేవినేని మల్లికార్జున్‌రావు, పట్టెం శ్రీనివాసరావు, సుధాకర చంద్రహాసరావు, తదితరులు పాల్గొన్నారు.

20వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

బాపట్ల,జనవరి 8 : తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 20వ రోజుకు చేరుకుంది. రాష్ట జేఏసి పిలుపు మేరకు పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ సీఆర్పీల సంఘం అధ్యక్షులు గిరి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీ.హెచ్ మజుందార్‌లు మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అందరికి ఉద్యోగభద్రత కల్పించి న్యాయం చేయాలన్నారు. లేకుంటే 2024 ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఉద్యోగులంతా సమస్యల సాధన కోసం ఐకమత్యంతో పోరాడాలని తెలియజేశారు. కార్యక్రమలో సాయికుమార్, అశోక్, రమేష్, మాణిక్యారావు, మోహనరావు, రాజేష్, వీరయ్య, సుధారాణి, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అఖండ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

● ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల,జనవరి 8: అఖండఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ సభ్యులతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీకి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సురేష్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్ళారు. ఆపదలో ఉన్నవారిని గుర్తించి ప్రతినెల తమ వంతు సహకారం అందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో చాపల సుబ్రహ్మణ్యం, వంగపాటి శివ, చేజర్ల సతీష్, పులిగడ్డ శ్యామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోన రఘుపతికి టిక్కెట్టు ఇస్తే పనిచేయం..

బాపట్ల, జనవరి 8 : పార్టీ శ్రేణుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఎమ్మెల్యే కోన రఘుపతికి తిరిగి టిక్కెట్టు ఇస్తే తాము పనిచేయమని వైసీపీ ఎంపీటీసీ, మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాంధ్ర సాంబశివరావు అన్నారు. వైసీపీ ఎస్సీసెల్ రాష్ట నేత ముప్పిరి రాజశేఖర్, కరీముల్లాతో కలిసి సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వైఖరితో మైనార్టీలంతా పార్టీకి దూరమయ్యారన్నారు. ప్రతి గ్రామం నుంచి పెద్దసంఖ్యలో వైసీపీ శ్రేణులు టీడీపీలోకి వెళుతున్నట్లు చెప్పారు. ప్రజలకు, పార్టీశ్రేణులకు, నాయకులకు ఎమ్మెల్యే కోన చేసిందేమిలేదని విమర్శించారు. పైగా కాంట్రాక్టర్‌లు, బిల్డర్లు, ఇసుకమాఫియా వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పార్టీనాయకులు, కార్యకర్తలకు భరోసానిచ్చి అధిష్టానం టిక్కెట్టు ఎవరికిచ్చిన ఏకతాటిపై కొచ్చి గెలుపు కోసం పనిచేస్తామన్నారు.

త్వరలో ఆలయ భూమికి వేలం

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

అమృతలూరు, జనవరి 8 : మండలంలోని గోవాడ శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయ తిరునాళ్ల సందర్భంగా ఖాళీ భూమికి త్వరలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అశోక్‌రెడ్డి తెలిపారు. 'గోవిందా.. దేవుని సొమ్ము వదలని వైనం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కాగా.. దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారులు స్పందించారు. త్వరలో ఆలయానికి చెందిన ఎ.0.96 సెంట్లు భూమికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

'భగ్నప్రేమికులు' చిత్ర ట్రైలర్ విడుదల

బాపట్ల, జనవరి 8 : బాపట్ల మండలం కొండుబొట్లపాలెం గ్రామానికి చెందిన నటుడు మల్లెల శ్రీనివాసరావు నటించి, నిర్మించి, దర్శకత్వం వహించిన భగ్నప్రేమికులు యదార్థచిత్ర ట్రైలర్‌ను ఎమ్మెల్యే కోన రఘుపతి విడుదల చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 16 సంవత్సరాలు పాటు అధ్యాపకునిగా పనిచేసి సినిమా తీయటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నటుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ నటన పట్ల ఆసక్తి ఉన్న తాను సినిమా ఎందుకు తీయకూడదు అనే ఆలోచనలో పుట్టిందే భగ్న ప్రేమికులు అని తెలిపారు. తనకున్న ఆస్తులు మొత్తం అమ్ముకొని సినిమా తీయటం జరిగిందన్నారు. సినిమాకు నిర్మాత, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, కథ, మాటలతోపాటు హీరో కూడా తానేనని చెప్పారు. ప్రేక్షకులు తన చిత్రాన్ని ఆదరిస్తారని ఆయన ఆకాంక్షించారు. సినిమాలో దేవరపల్లి ఆది రెండోవ హీరోగా, భానుచందర్ తండ్రి పాత్రలో నటించారన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కార్పోరేషన్ డైరెక్టర్ కన్నా మామిడయ్య, వైసీపీ మండలాధ్యక్షులు కోకి రాఘవ రెడ్డి, మల్లెల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు సీఎం కృషి

వేమూరు, జనవరి 8 : రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకదృష్టి సారించి కృషి చేస్తున్నారని జడ్పీటీసీ గాజుల హేమలత తెలిపారు. సోమవారం ఆమె వేమూరు, జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందుకుంటూ విద్యార్థులు 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సంబంధించిన మెటీరియల్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గాజుల భానుప్రకాష్, వైస్ ఎంపీపీ షేక్ బాజీ, కో ఆప్షన్ సభ్యులు సువర్ణరాజు, ప్రధానోపాధ్యాయులు పద్మజ, నరసింహస్వామి, దొప్పలపూడి జ్యోతిబాబు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

బాపట్లటౌన్, జనవరి 8 : పట్టణంలో బాపట్ల పబ్లిక్ స్కూల్, నారాయణ పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బాపట్ల పబ్లిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ వీఎస్.రఘురాం తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఎంతో ఆకర్షణగా నిలిచింది.

రేపల్లె : పట్టణంలోని రామకృష్ణ ఇంగ్లీషుమీడియం హైస్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కె.అవర్ణ మాట్లాడుతూ..విద్యార్థినీ, విద్యార్థుల చేత సంక్రాంతి పండుగ ఉట్టి పడేలా పాఠశాలల్లో ముగ్గులు, గొబ్బెమ్మలు అలికిన ఇళ్ళను తయారు చేశారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించామని మదర్‌థెరిస్సా యూనెస్కో క్లబ్ అధ్యక్షురాలు దాసరిఝాన్సీలక్ష్మీ తెలిపారు. ఈపోటీల్లో సుమారు 30 మంది పాల్గొనగా ప్రథమ బహుమతి పి.శిరీషా, ద్వితీయ బహుమతి కేఎస్‌వీడి భవాని, తృతీయ బహుమతి డి.రాధా, కన్సొలేషన్ బహుమతి వీ.రమాదేవిలు పొందారు.



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న రామకృష్ణ ఇంగ్లీషుమీడియం స్కూలు విద్యార్థినులు

నిర్ణీతవ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించండి

● అధికారులకు కలెక్టర్ పీ.రంజిత్‌బాషా ఆదేశం

● కలెక్టరేట్ స్పందనలో బాధితుల నుంచి అర్జీల స్వీకరణ



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు సమస్యలు వివరిస్తున్న బాధితులు

బాపట్ల, జనవరి 8 : జిల్లాలో స్పందన అర్జీలపై వెంటనే స్పందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి వివిధ ప్రాంతాలు నుంచి పెద్దఎత్తున అర్జీదారులు వచ్చి తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన గడువులో స్పందన అర్జీలు పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. భూములకు సంబంధించిన సర్వే సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని సర్వే సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన అర్జీలు గడువులోగా పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, డీపీవో రాంబాబు, డీఆర్డీఏ పీడీ కృష్ణ, డ్వామా పీడీ అర్జున్, గృహ నిర్మాణశాఖ పీడీ ప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఎస్‌వో విలియమ్స్, సివిల్ సప్లయి డీఎం శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం భూమిని కాజేసేందుకు కుట్ర..

జిల్లాలోని అద్దంకి మండలం అద్దంకి గ్రామంలోని కొంగపాడు ఎత్తిపోతల పథకం భూమిని రెవెన్యూ రికార్డులు తారుమారుచేసి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైసీపీ మాజీ ఇన్‌చార్జి దాచిన కృష్ణ చైతన్యపై చర్యలు తీసుకోవాలని ఆయుకట్టు రైతులు సోమవారం స్పందనలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు రావినూతల వెంకటసుబ్బారావు, కుందుర్తి రాఘవరెడ్డి, జాగర్లమూడి యలమందరావులు మాట్లాడుతూ సర్వేనెంబరు 1873/2లోని ఎకరం 8సెంట్ల భూమిలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయగా కొద్దికాలంగా పథకం నిర్వాహణ నిలిచిపోవటంతో వేరొక పథకానికి ప్రతిపాదనలు చేశారన్నారు. దీంతో వంగపాడు ఎత్తిపోతల పథకంకు సంబంధించిన భూమిని రెవెన్యూ రికార్డులలో కొల్లి వెంకట్రావు పేరుతో ఉన్నట్లు బాచిన కృష్ణచైతన్య నమోదు చేయించి ఆతర్వాత ఆ భూమని వెంకట్రావు వద్ద నుంచి కృష్ణచైతన్య కొన్నట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. సుమారు రూ. 5 కోట్ల విలువగలిగిన భూమిపై వెంకట్రావుకు ఏ హక్కు లేదన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటి దాసు డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులు, నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జెబి.శ్రీధర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి దళాయి సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అద్దంకి నాగేశ్వరరావు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించండి..

జిల్లాలోని భట్టిప్రోలుగ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులలో రూ.60 లక్షలు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై విజిలెన్స్ అధికారులచే విచారణ జరిపించాలని తూనుగుంట్ల సాయిబాబా సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందనలో ఫిర్యాదు చేశారు. తప్పుడు నివేదికలతో కూలీల పేరుతో కొంతమందితో కలిసి డబ్బులు స్వహా చేశారని ఆయన ఆరోపించారు. ఏవిధమైన పనులు చేయకుండానే చేసినట్లు చూపించి నిధులు స్వహా చేశారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టరును కోరారు.

ఫిర్యాదులు వేగవంతంగా పరిష్కరించాలి

● ఎస్పీ గ్రీవెన్స్‌లో అడిషనల్ ఎస్పీ పీ.మహేష్

బాపట్ల, జనవరి 8 : స్పందన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ పి.మహేష్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ వివిధ ప్రాంతాలు నుంచి 82మంది ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ చట్టపరిధిలో ఫిర్యాదులపై విచారణ జరిపి వెంటనే పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో స్పందనసెల్ ఎస్ఐ బీవీ.డేవిడ్, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు పెంచమంటే ..

ఎస్మా ప్రయోగిస్తారా?

● అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రేఖా ఎలిజబెత్

● 28వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మె ..

● నిరసన ర్యాలీలు.. అంబేద్కర్ విగ్రహానికి వినతులు



బాపట్లలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

బాపట్ల, జనవరి 8: వేతనాలు పెంచమని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మె చేస్తుంటే వారిపై ఎస్మా ప్రయోగించటం దారుణమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రేఖా ఎలిజబెత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారం 28వ రోజుకు చేరుకుంది. స్థానిక ఉప్పరపాలెం రోడ్డుపై మూడురోజులుగా అంగన్‌వాడీలు 24 గంటల రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలకు న్యాయవాదులు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు సంఘీభావం తెలిపి దీక్షలో కూర్చొని మద్దతు తెలియజేశారు. మూడవరోజు దీక్షలో ఎం.కామేశ్వరి (అమర్తలూరు), ఎన్.పద్మజ (కొరిశపాడు), ఆర్.చైతన్య (కొరిశపాడు), యేమినేని మేరి మణి (పల్లపట్ల)లు కూర్చున్నారు. అనంతరం వారు మునిసిపల్ కార్యాలయం వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో సీఐటీయూ నేతమజుందార్, జె.శామ్యూల్, శరత్, వెలగా శైలశ్రీ, సీతామహాలక్ష్మీ, హేమమాలిని, పద్మ, భారతి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు: తమపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ, తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రం కొల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు బి.చలమయ్య, సీపీఐ, సీఐటీయూ, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

రేపల్లె : స్థానిక తహసీల్దార్ కార్యాలయం గేటు వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె 28వరోజుకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించటం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పీవీ నాగలక్ష్మీ, వీ.రమాదేవి, జీ.అరుణశ్రీ, కే.విజయలక్ష్మీ, సునీత, రత్తమ్మ, వై.కనకదుర్గ, నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీ సంఘాల నేతలతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గల సమ్మె శిబిరం నుంచి న్యాయదేవత కళ్ళకుగంతలు కట్టి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కే.వాణి, డీ.జ్యోతి, ఎన్.కృష్ణకుమారి, నిర్మలా జ్యోతి, సీహెచ్ మణిలాల్, వై.కిషోర్, ఏ.ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

అమృతలూరు: అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం అన్యాయమని సీఐటీయూ నాయకులు బి.అగస్టీన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లజెండాలు చేతబట్టి ఎస్మా చట్టం జీవో ప్రతులను దహనం చేశారు. 28 రోజులుగా అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తుంటే రాష్ట ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అత్యవసర సేవల పేరుతో ఎస్మా పరిధిలోకి తీసుకు వచ్చి అంగన్‌వాడీలను బెదిరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తెలంగాణా కంటే అదనంగా జీతాలు ఇస్తామన్న హామీని జగన్ చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

వేమూరు: నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మె సోమవారం 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన ఏర్పాటు చేశారు. టీడీపీ బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్‌కుమార్, సీఐటీయూ నేతలు సమ్మె శిబిరాన్ని సందర్శించి అంగన్‌వాడీల పోరాటానికి మద్దతు తెలిపారు. పట్టణంలో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 17గ్రామాల పరిధిలోని అంగన్‌వాడీలు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించాలి

● సీపీఐ జిల్లా నాయకులు జేబీ. శ్రీధర్

బాపట్లటౌన్, జనవరి 8 : ఉపాధిహామీ పనులను తక్షణమే ప్రారంభించి గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని సీపీఐ జిల్లా నాయకులు జేబీ.శ్రీధర్ అన్నారు. సోమ వారం కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి సీపీఐ నాయకులతో పాటు హాజరై జేసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీలకు పనులు దొరకక ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని దీనిపై స్పందిత అధికారులు దృష్టిసారించి స్థానికంగా పనులు కల్పిస్తే జీవనోపాధి మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎ.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో మెరుగైన ఉపాధి

బాపట్లటౌన్, జనవరి 8 : ఫార్మారంగంలో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయని బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులంతా పరిశోధనవైపు దృష్టి సారించాలని సూచించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులంతా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో బాపట్లఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కొమ్మినేని హరిపద్మప్రసాద్, కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ట్రెజరర్ తాళ్ళూరి రామకృష్ణ పాల్గొన్నారు.

అమెరికా నుంచి ఐలవరంకు ఉత్తరాలు ..

భట్టిప్రోలు, జనవరి8: అమెరికాలోని నంబరస్కో రాష్ట్రం, ఒమాహకు చెందిన విద్యార్థులు పంపించిన ఉత్తరాలు మండలంలోని ఐలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చేరినట్లు హెచ్ఎం మాచర్ల మోహనరావు సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్‌పాల్ ప్రోగ్రాం ద్వారా వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులతో ఆంగ్ల భాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేలా విద్యార్థులకు పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పీ.హరికృష్ణ శిక్షణ ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే నైహార్డ్ విద్యార్థులు రాసిన ఉత్తరాలు పాఠశాలకు రాగా, వాటిని ఎంఈవోలు పీ.లాజర్, ఎన్. దేవరాజ్‌లు విద్యార్థులకు అందజేశారు. నైహార్డ్ పాఠశాల ఉపాధ్యాయుడు థామస్ విజ్‌నెండ్ జూమ్‌ద్వారా మండల విద్యాశాఖాధికారులతో సంభాషించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు తొమ్మిది అర్జీలు

రేపల్లె, జనవరి 8: రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆర్డీవో హేలా షారోన్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో ప్రజలనుంచి తొమ్మిది అర్జీలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన పలువురు సచివాలయానికి రంగులువేశామని నిధులు మంజూరు చేయాలని కోరారు. రేపల్లె మండలం పిరాట్లంక గ్రామంలో మురుగునీరు పారుదల చర్యలు తీసుకోవాలి. ఇసుకపల్లి గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఇసుకపల్లి గ్రామానికి చెందిన ఓవృద్ధుడు తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరుచేయాలని కోరాడు చుండూరు మండలం ఆల పాటి గ్రామానికి ఓరైతు తన పొలాన్ని ఆన్‌లైన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. రేపల్లె పట్టణం 5వ వార్డులో ఆక్రమణలు తొలగించాలని కోరారన్నారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పలువురు పాల్గొన్నారు.

నగర సంకీర్తన సభ్యులకు సత్కారం

భట్టిప్రోలు, జనవరి 08 : ధనుర్మాసం సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఐలవరంలో నగర సంకీర్తన సభ్యులను సోమవారం ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ జిల్లా దేవాలయాల కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ నగర సంకీర్తన సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించారు. గత ఆరు సంవత్సరాలుగా ఐలవరం గ్రామంలో ధనుర్మాసంలో క్రమం తప్పకుండా గ్రామ ప్రజల సంక్షేమం కోసం నగర సంకీర్తనలను నిర్వహించడం మార్గదర్శనీయమని అతిథులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్ బూర్లె అరుణకుమారి, వేల్పూరి శ్రీనివాసరావు, బట్టు వీరరాఘవయ్య, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐతంరాజు మృతి బాధాకరం

చుండూరు, జనవరి 8 : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి యడ్లపల్లి ప్రాంతంలో పార్టీ కార్యక్రమాలపై అంకిత భావంతో కృషి చేసిన వ్యక్తి పెన్నాం ఐతంరాజు (75) మృతి బాధాకరమని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. సోమవారం చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో అనారోగ్యంతో ఐతంరాజు మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని ఆనందబాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆనందబాబు వెంట మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పరిశుభ్ర వాహనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన

సఫాయి కర్మచారులకు

పారిశుధ్య పరిశుభ్ర వాహనాలు అందజేత

బాపట్ల,జనవరి 8 : జిల్లాలో ఎన్ఎస్ కెఎఫ్‌డిసి పథకం కింద 2.53 కోట్ల రూపాయల విలువ చేసే 8 వాహనాలను సోమవారం లబ్దిదారులకు అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పోరేషన్ ద్వారా సఫాయి కర్మచారులకు పారిశుద్య పరిశుభ్ర వాహనాలను ఎమ్మెల్యే కోన రఘుపతితో కలిసి కలెక్టర్ పి.రంజిత్‌బాషా లబ్దిదారులకు అందజేశారు. జెండాఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి మున్సిపాలిటిలలో 8మంది లబ్దిదారులకు వాహనాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క వాహనం ఖరీదు 31,67,326 రూపాయలు కాగా ప్రభుత్వం సబ్సిడీ 15లక్షల రూపాయలు ఇవ్వగా ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి రుణం 16,60,946 రూపాయలు మంజూరు చేయటం జరిగిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లబ్దిదారులు, అధికారులు పాల్గొనగా కలెక్టర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

సంక్రాంతి సంబరాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు

● ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల,జనవరి 8 : కోన ఛారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను సోమవారం కోనఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేది శనివారం సాయంత్రం 5గంటలకు తిరుమల-తిరుపతి దేవస్థానం అహోబిలం, కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌భక్తిగీతాలాపన స్థానిక శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరాభావన్నారాయణస్వామి దేవస్థానంలో జరుగుతుందన్నారు. 14వ తేది ఉదయం 5గంటలకు భోగి మంటలు, 7గంటలకు ధాన్యలక్ష్మీపూజ, 9గంటలకు పొంగలి నివేదన ఉంటుందన్నారు. సాయంత్రం 6గంటలకు బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో మ్యూజికల్‌నైట్ సంగీతవిభావరి, కామెడిషో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సిద్దుజొన్నలగడ్డ (డీజే టిల్లు) హాజరవుతారన్నారు. ప్రముఖ మ్యూజికల్ డైరెక్టర్, సింగర్, రైటర్ భీమ్స్, విశిష్ట అతిథిగా రామ్‌మిరియాల, ఫ్యామిలిషోటీమ్‌లీడర్ చమ్మక్‌చంద్ర, సింహ, సాకేత్, మాళవిక, రమ్యబెహరా, వరం, సత్తిపండు, పవన్, సత్యశ్రీ, సద్దాం, భాస్కర్, నవసందీప్, పులి, నూకరాజులు పాల్గొన్నారు. యాంకర్‌గా నల్లమోతు దీప్తి వ్యవహరిస్తారని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు సంబరాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ, మండలాధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, సీనియర్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

రేపల్లె, జనవరి 8:రానున్న ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని రౌడీషీటర్లపై ప్రత్యేకనిఘా ఏర్పాటు చేశామని డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని రౌడీషీటర్ల కదలికలను, రౌడీషీటర్ల కౌన్సిలింగ్ అనుమానితులను బైండవర్ చెయ్యటంపై సిబ్బందికి సూచనలు అందించామని తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. దొంగతనాలు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్‌పై తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నజీర్‌బేగ్, ఎస్ఐలు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

స్టూవర్ట్‌పురంలో మద్యం స్వాధీనం

బాపట్ల,జనవరి 8 : సెబ్ అధికారులు సోమవారం స్టూవర్ట్‌పురం, సూర్యలంకలో దాడులు నిర్వహించారు. సూర్యలంకలోని ప్రైవేట్ చెక్‌పోస్ట్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు అనే వ్యక్తి వద్ద నుంచి 10 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా స్టూవర్టుపురం గ్రామంలోని పెదగ్యాంగ్‌లో 5 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని, కర్రెద్దుల అపరంజం, కుంచాల శ్రీలక్ష్మీలపై కేసు నమోదు చేసిన్నట్లు తెలిపారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్ఐ ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలోని టీచర్స్ కాలనీ నుంచి హైవేరోడ్డుకు వెళ్ళే దారిలో బడ్డీకొట్టులో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావటంతో పట్టణ ఎస్ఐ షేక్.మహ్మద్ రఫీ దాడిచేసి తాడిశెట్టి నరసింహారావును అదుపులోకి తీసుకొని ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారును ఢీకొన్న ద్విచక్రవాహనం.. ఇద్దరికి గాయాలు

బాపట్లరూరల్, జనవరి 8 : ద్విచక్రవాహనంపై అతివేగంతో వెళుతూన్న వ్యక్తి ఓ కారుని ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలైన ఘటన సోమవారం బాపట్ల మండలం అప్పికట్ల గ్రామ సమీపంలోని రహదారిపై జరిగింది. బాపట్ల నుండి పొన్నూరు వైపుకు వెళుతున్న కారును ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు వెనుక నుండి వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన తోటి వాహనదారులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నల్లకండువాలతో అంగన్‌వాడీల నిరసన

భట్టిప్రోలు, జనవరి 08 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరవధిక సమ్మె సోమవారం 28వ రోజుకు చేరింది. నల్ల కండువాలు మెడలో వేసుకుని తమ నిరసనను తెలియజేశారు. ఎస్మా ప్రయోగిస్తూ తీసుకువచ్చిన జీవో నెం.2ను ప్రభుత్వం తక్షణమ ఉపసంహరించుకోవాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నినదించారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం ఏంటని ఎస్మాకు లొంగేదిలేదని సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయు మండల కార్యదర్శి జి. సుధాకర్, ఆయా ప్రజా సంఘాల, రైతు సంఘాల నాయకులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, యూనియన్ మండల అధ్యక్షురాలు బి. రమాదేవి, సెక్టార్ లీడర్లు గృహలక్ష్మీ, సూర్యలక్ష్మీ, భద్రకాళీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేస్తాం

బాపట్ల,జనవరి 8 : బాపట్లపార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని దళితులను ఐక్యంచేసి టీడీపీ విజయానికి కృషి చేస్తానని టీడీపీ యువనాయకులు దగ్గుమళ్ళ రాధేయ్ తెలిపారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు నాయకత్వంలో ఈనెల 13న బాపట్ల విలియం బూత్ జూనియర్ కళాశాలలో ప్రజాపరిచయ వేదిక ఏర్పాటు చేసి దళితులందరిని సమీకరించి రాష్ట్రానికి చంద్రబాబునాయుడు నాయకత్వం అవసరమని వివరిస్తామన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను టీడీపీనాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య, బాపట్ల పార్లమెంట్ క్రిస్టియన్‌సెల్ అధ్యక్షులు జంగం ప్రవీణ్, ఎస్సీసెల్ సెక్రటరి బడుగు యోహాను, పర్చూరు తెలుగుయువత ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజు, జంగం రాజశేఖర్, చెన్నుపాటి హైమావతి, దగ్గుమల్లి రాణి, పల్లంజీవన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పరిచయ వేదిక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీడీపీ నేత రాధేయ్ తదితరులు

కార్మికులపై ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి



అద్దంకిలో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

అద్దంకిటౌన్, జనవరి 8: కార్మికులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం ఏమీ తెలియనట్లు మొండివైఖరి అవలంభించడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డుపైకి పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, గాలి బీష్మా, అంజమ్మ, ఆలివేలు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్



సంఘ సేవకుడు జ్యోతయ్యను పరామర్శిస్తున్న రవికుమార్

అద్దంకి, జనవరి 8: పలు కుటుంబాలను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోమవారం పరామర్శించారు. సంఘ సేవకుడు పంతంగి జ్యోతయ్య ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోగా పరామర్శించారు. 3వ వార్డులో నాగిడి కొండయ్య భార్య ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. 11వ వార్డులో విశ్రాంత ఏఎస్సై గోచిపాతల ఐజాక్ ప్రభాకర్ ఇటీవల మృతిచెందగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 9వ వార్డులో కొత్తపల్లి శ్రీనివాసరావు తండ్రి ఇటీవల మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. 19వ వార్డులో టీడీపీ నేత మస్తాన్‌వలి సోదరుడు బొమ్మాసా ఇటీవల మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు. కొండముది బ్రహ్మాచారి ఇటీవల మృతి చెందగా త్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మత్స్యకారులకు అండగా ఉంటా!



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండయ్య

చీరాల, జనవరి 8: మత్స్యకారులకు అన్నివిధాల అండగా ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వేటపాలెం మడలం రామాపురం, కఠారివారిపాలెంలకు చెందిన పలువురు మత్స్యకార మహిళలు కొండయ్యను కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో రానున్న టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందుకోసం చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీ సభ్యులు

మార్టూరు, జనవరి 8: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని వలపర్ల జడ్పీ హైస్కూల్లో సోమవారం మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్కూల్లో వంద మొక్కలను నాటటంతో పాటు, వాటిని సక్రమంగా పెంచాలని సాంబశివరావు కోరారు. కార్యక్రమంలో ఇంటూరి ఆంజనేయులు, షేక్ ఖాజా హుస్సేన్, కొర్రపాటి కాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బైకిస్టుకు గాయాలు

మార్టూరు, జనవరి 8: మార్టూరు నుంచి డేగరమూడి వెళ్లే సర్వీసు రోడ్డులో రామ్‌నగర్ సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనదారుడు దేవరకొండ అనిల్‌ను వెనుకవస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. సోమవారం ఉదయం చిలకలూరిపేటకు చెందిన అనిల్ వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్రవాహనంపై మార్టూరుకు వస్తున్నాడు. ఈక్రమంలో చిలకలూరిపేట వైపు నుండి కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుండి వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు.

తైక్వాండో పోటీలలో సత్తా చాటిన విద్యార్థులు

చినగంజాం, జనవరి 8: మండలంలోని చినగంజాం సత్యం హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో రజిత పతకాలు సాధించారు. మార్కాపురంలో రాక్వెల్ పబ్లిక్ స్కూల్ ఆదివారం జరిగిన 37వ జూనియర్స్, క్యాడెట్ జూనియర్, సీనియర్స్ బాలబాలికలు జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్-2024 పోటీలలో పతకాలు సాధించినట్లు కోచ్ వాటుపల్లి సుబ్రమణ్యం తెలిపారు. ఈ పోటీలలో స్నిగ్ధశ్రీ, జనని, యామని, కేదారలక్ష్మి, అవిక్తలు రజిత పతకాలు సాధించినట్లు చెప్పారు. సోమవారం హెచ్.ఎం రాయని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో కరస్పాండెంట్ సున్నా హరనాథ్‌బాబు, ఉపాధ్యాయులు కల్పనాదేవి, మేరికుమారి, తుమ్మలపెంట రమేష్‌బాబు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌సలాం, కోచ్ సుబ్రమణ్యం, విద్యార్థులను అభినందించారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

చినగంజాం, జనవరి 8: మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాలు నిర్వహించినా, పందాలలో పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కెసురేష్ హెచ్చరించారు. మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జీడిచెట్లపాలెం గ్రామ శివారులో కోడిపందాల స్థావరంపై ఎస్‌ఐ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కోళ్లను, రూ.1800 నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

పర్చూరులో 13 నుంచి క్రికెట్ పోటీలు

పర్చూరు, జనవరి 8: పర్చూరులోని బుగ్వేద్ క్రికెట్ ఆరీనా క్రీడా ప్రాంగణంలో ఈనెల 13 నుంచి మెగా సౌత్ ఇండియా లెవెల్ క్రికెట్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తులసి శివనాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.3 లక్షలు, రెండవ బహుమతి రూ.2 లక్షలు, మూడవ బహుమతి రూ.లక్ష చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

పేరాల(చీరాలటౌన్), జనవరి 8 : విద్యార్థి దశలో వినోదంతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేరాల ఏఆర్‌ఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాల్మన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు మానవ శరీర భాగాలు, సైన్స్ ప్రయోగాలు, పర్యావరణ స్పృహను కలిగించే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ, యల్లమందేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోనంకిలో చోరీ

మార్టూరు, జనవరి 8: మండలంలోని కోనంకి గ్రామంలో పి.వాసుదేవరావు అనే ఉపాధ్యాయుడి ఇంటిలో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. రూ.30 వేలు విలువ చేసే మూడు వెండి పళ్లాలు, మరి కొంత నగదు కలిపి మొత్తం రూ.లక్షా 90 వేలు చోరీకి గురయ్యాయి. ఎస్సై ఎం.శ్రీనివాసరావు కథనం మేరకు.. వాసుదేవరావు మండలంలోని తాటివారిపాలెంలో, అతని భార్య వెంకట శ్యామలాదేవి బొబ్బేపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి వచ్చారు. అనంతరం మార్టూరులో ఎమ్మార్సీ భవనంలో జరిగిన సమావేశానికి హాజరై సాయంత్రం ఇంటికి రాగా, గేటు తాళం కప్ప నేలపై పడి ఉంది.. దాంతో హడావుడిగా ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. అందులో ఉన్న మూడు వెండి పళ్లాలు, నగదు అపహరించారు. సమాచారం అందుకున్న సీఐ అక్కేశ్వరరావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులైన ఉపాధ్యాయ దంపతులతో మాట్లాడారు. బాధితురాలు శ్యామలాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అద్దంకి వైసీపీలో కొనసాగుతున్న వార్

- 11న వైసీపీ సాధికార బస్సు యాత్ర
- ఆ తర్వాత మరిన్ని కీలక పరిణామాలకు అవకాశం
- ఢీ అంటే ఢీ అంటున్న ఇరువర్గీయులు

అద్దంకి, జనవరి 8: అద్దంకి వైసీపీలో వార్ కొనసాగుతోంది. ఇప్పటికే వైసీపీ క్యాడర్ ఇరువర్గాలుగా విడిపోయింది. ఈనెల 11న అద్దంకిలో జరిగే వైసీపీ సాధికార బస్ యాత్ర తరువాత మరిన్ని కీలక పరిణామాలు జరిగే అవకాశం ఉన్నట్లు చర్చ సాగుతుంది. నాలుగున్నరేళ్ళుగా వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న బాచిన కృష్ణచైతన్య ను తప్పించి గుంటూరు జిల్లాకు చెందిన పాణెం హనిమిరెడ్డిని నెల రోజుల క్రితం ఇన్‌చార్జ్‌గా నియమించారు. తొలుత ఒకింత సందిగ్ధంలో ఉన్న నేతలు, కార్యకర్తలు క్రమేమి వర్గాలుగా విడిపోయారు. దీంతో వైసీపీ నేతలు, క్యాడర్ ఒక్కసారిగా రెండు వర్గాలుగా మారారు. వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న హనిమిరెడ్డి అధిష్టానం అండదండలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్యాడర్, కార్యకర్తల బలం ఉన్న బాచిన కృష్ణచైతన్య అంతర్గత సమావేశాలు, పరామర్శలు చేస్తున్నారు.. దీంతో ఇద్దరు నాయకులు ఎవరికి వారు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేతలు, కార్యకర్తలు కూడా అత్యధిక శాతం ఎవరి వర్గం వారుగా విడిపోయారు. కొద్దిమంది మాత్రం రెండుచోట్ల హాజరవుతున్నారు. కృష్ణచైతన్య గత మూడు రోజులుగా రోజుకొక మండలం చొప్పున కొరిశపాడు, పంగులూరు, అద్దంకి మండలాల నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. సమావేశాలకు ఆయా మండలలోని ప్రధాన నాయకులతో పాటు గ్రామస్థాయి నాయకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. సోమవారం విరామం ఇవ్వగా, మంగళవారం బల్లికురవ, బుధవారం సంతమాగులూరు మండలాల నేతలతో కృష్ణచైతన్య సమావేశాలు నిర్వహించనున్నారు.

11న సాధికార బస్సు యాత్ర

వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన వైసీపీ సాధికార బస్సు యాత్ర ఈనెల 11న అద్దంకి లో జరగనుంది. ఈయాత్ర ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి ఆధ్వర్యంలో జరగనుంది. కృష్ణచైతన్యతో పాటు ఆయన పక్షాన నిలిచిన నేతలు, కార్యకర్తలు గైర్హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. దూరంగా ఉన్న నేతలను దగ్గర చేసుకోవాలన్న ఉద్దేశంతో సాధికార బస్సు యాత్రకు హాజరుకాని నేతలపై వేటు పడుతుందని హెచ్చరికలు కూడా పంపుతున్నట్లు తెలుస్తుంది. చైతన్య పక్షాన పలు మండల పార్టీల అధ్యక్షులతో పాటు కీలక నేతలు ఉన్నారు. ఈనేపథ్యంలో ఈ హెచ్చరికలను చైతన్య వర్గీయులు లెక్క చేయకుండా తాడోపేడో తేల్చుకునేందుకే సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో సాధికారిక బస్సు యా త్ర తరువాత ఇరువర్గీయుల మధ్య మరింత అగాధం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అంగన్‌వాడీలపై 'ఎస్మా' ప్రభుత్వ పతనానికి నాంది

- పలు సంఘాల నేతలు ధ్వజం
- 28వ రోజుకు చేరిన సమ్మె



అద్దంకిలో ఎస్మా జీవో ప్రతులను తగలబెడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అద్దంకిటౌన్, జనవరి 8: అంగన్‌వాడీలపై వైసీపీ ప్రభుత్వం ఎస్మా ఉపయోగించడం చేతగాని చర్య అని, ప్రభుత్వ పతనం దీనితోనే ప్రారంభం అయిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు తమ డిమాండ్‌ల సాధనకోసం చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా జీవో నెం.2 ప్రతులను త గులబెట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి.శారద, మనోలత, అనిత, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

చీరాల, జనవరి 8: తమపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము సమ్మె నోటీసు ఇచ్చినపుడు ప్రభుత్వానికి నిబంధనలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కేవలం తమ సమ్మెను, తమ ఉద్యమాన్ని అణచివేసేందుకు మాత్రమే వైసీపీ ప్రభుత్వం నిరంకుశ ధోరణిని అవలంబిస్తుందన్నారు. అందుకు తగిన విధంగా సమయం వచ్చినపుడు తాము బటన్ నొక్కి మరీ సమాధానం చెప్తామని హెచ్చరించారు. వారికి సీఐటీయూ బాధ్యులు ఎం.వసంతరావు, తదితరులు సంఘీభావం తెలిపారు.

కళ్లకు గంతలు కట్టుకొని..



బల్లికురవలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బల్లికురవ, జనవరి 8: గత 28 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేయాలని చూస్తుందని, అందుకే కార్యకర్తల సమ్మెను పట్టించుకోవటం లేదని విమర్శించారు. అంగన్‌వాడీలకు సీఐటీయూ నేతలు సీహెచ్ గంగయ్య, బత్తుల హనుమంతరావు సంఘీబావం ప్రకటించారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, జాస్లిన్, సునంద, అరుణ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు: ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో అంగన్‌వాడీలు తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని సోమవారం నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాడతామని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, ప్రాజెక్టు లీడర్లు సరళ, శ్రీలత, అనంతలక్ష్మి, రాజ్యలక్ష్మి, రమాదేవి, అంజమ్మ, లావణ్య, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం, జనవరి 8: తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళనలు చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వేతనాలు పెంచడంతో పాటు దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 28వ రోజు కొనసాగింది. ప్రభుత్వం ఎస్మాతో భయపెట్టాలని చూసినా ఆదిరేది బెదిరేది లేదని అంగన్‌వాడీ సంఘం నాయకులు హైమావతి, రంగనాయకమ్మ, ఆదిలక్ష్మి, కె.యానాదమ్మ అన్నారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు, ఆయాలు నల్ల రిబ్బన్లు కళ్లకు గంతలుగా కట్టుకొని నిరసన తెలిపారు.

మార్టూరు: నల్లటి వస్త్రాలను మెడలో ధరించి సోమవారం మండల కాంప్లెక్స్ వద్ద మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బత్తుల హనుమంతరావు, అంగన్‌వాడీలు శ్యామల, విజయ, సుహాసిని, అంజలి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. యద్దనపూడి మండలంలోనూ సమ్మెను కొనసాగించారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



బల్లికురవ: కొణిదెన ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అద్దంకి: విప్పర్లవారిపాలెం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలలో ముగ్గులు, భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అద్దంకి, జనవరి 8: మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల చేత ముగ్గులు వేయించి, భోగి మంటలు వేశారు. గాలి పటాలు ఎగురవేశారు. మంగళవారం నుంచి సంక్రాంతి సెలవుల నేపథ్యంలో సోమవారం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రకాశం ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అద్దంకిటౌన్: సంక్రాంతి సంబరాలలో భాగంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఈటీ హనుమంతరావు ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు పరిశీలించి ముగ్గులలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, కోలాట ప్ర దర్శన, భోగి మంటలతో చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నారు.

బల్లికురవలో.. బల్లికురవ, జనవరి 8: మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు నిర్వహించారు. కొణిదెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు కాకోలు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో హెచ్‌ఎం కేబీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సంక్రాతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. అలాగే, బల్లికురవ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంతరావు పాల్గొన్నారు.

యద్దనపూడి(మార్టూరు): యద్దనపూడి మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మండలంలోని యనమదల యూపీ స్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు భవాని ఆధ్వర్యంలో బాలికలు పొంగళ్లు పెట్టారు. స్కూల్లో రంగు రంగుల ముగ్గులు పెట్టారు. విద్యార్థులు ధింసా నృత్యాలను వృత్తాకారంగా చేసి అలరించారు. కార్యక్రమంలో సునీత, సుధారాణి, లీలారాణి, రత్నకుమారి కొర్రపాటి రాణి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు. అలాగే, మార్టూరు మండలం వలపర్ల గ్రామంలోని సుమేధ స్కూల్లో భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రమీలా దేవి, ఉపాధ్యాయురాలు సుభాషిణి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలోని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ పద్మావతి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయటానికి సంక్రాంతి సంబరాలు దోహదపడతాయని అన్నారు. పాఠశాల ఆవరణలో రంగవల్లికలు, సంప్రదాయ కోలాటాలు, భోగి మంటలు, గాలిపటాలు, గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ నృత్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిరత్నం, ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎన్.చంద్రశేఖర్, పి.హిమవంతేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు సరఫరాచేసి రైతులను ఆదుకోవాలి

- ఎమ్మెల్యే కరణం బలరాం



రైతుల సమస్యను పరిష్కరించాలని ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, జనవరి 8: తోటవారిపాలెం ఎత్తిపోతల పథకం పరిధిలో సాగుచేసిన పైర్లు బెట్టకొచ్చాయని, కనీసం పది రోజుల పాటు సాగునీరు, ఉచిత విద్యుత్ అనివార్యంగా సరఫరా చేయాలని ఇరిగేషన్, విద్యుత్ అధికారులకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చెప్పారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం పలు గ్రామాల రైతు ప్రతినిధులు, రైతులు ఎమ్మెల్యే బలరాంను సాగునీటిని సరఫరా చేయించి ఆదుకోవాలని కోరారు. వెంటనే బలరాం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

పంట ఉత్పత్తులు చేతికందే సమయంలో బెట్టకు వస్తే జరిగే నష్టాన్ని అధికారులకు వివరించారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే బలరాంను కలిసిన వారిలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, జీఎం వెంకటేశ్వర్లు, సాయిల వాసు, గవిని సాంబు, రామకృష్ణ, బుజ్జి, పలుగ్రామాల రైతులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చీరాల, జనవరి 8: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపీటీలో చీరాల మండలం తోటవారిపాలెం, పట్టణంలోని జయంతిపేట పరిధిలోని 194 మందికి నివేశన స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సరోజిని, తహసీల్దార్ ప్రభాకరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక మసీదు సెంటర్లో నిర్మాణంలో ఉన్న డ్రైనేజి, రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలరాం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి పరిశీలించారు. అలాగే, 31వ వార్డులో నిర్మాణంలో ఉన్న చిన్న పిల్లల పార్కు పనులను పరిశీలించారు. మండల పరిధిలోని జాండ్రపేటలో రేషన్ సరుకుల పంపిణీ చేస్తున్న ఓ ఎండీయూ వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి కార్డుదారులతో మాట్లాడారు. దేవాంగపురి పంచాయతీ పరిధిలో దేవాంగ భవన్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లీకులు అరికట్టేదెప్పుడో..!

- రోడ్డు పాలవుతున్న తాగునీరు



అద్దంకిలోని భవానీ సెంటర్‌లో మంచినీటి పైప్‌లైన్ నుంచి లీకై రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

అద్దంకి, జనవరి 8: అద్దంకి పట్టణంలో మంచినీటి పైప్‌లైన్‌లు లీకులు అవుతుండటంతో నీరు వృథా అవుతూ రోడ్లపై పారుతుంది. పట్టణంలోని భవానీ సెంటర్‌లో నామ్‌రోడ్డు, రేణింగవరం రోడ్డు కూడలిలో పక్షం రోజులుగా మంచినీటి పైప్‌లైన్ లీకు అవుతుంది. దీంతో నీటి విడుదల జరిగిన ఉదయం, సాయంత్రం సమయాలలో నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. రోడ్డుపై చేరిన నీరు డ్రైనేజీ కాలువల పాలవుతున్నాయి. ప్రధాన కూడలి ప్రాంతంలో పైప్‌లైన్‌ల నీరు లీకవుతున్నా అధికారులకు కనిపించకపోవటం విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి పైప్‌లైన్‌ల లీకులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

నేడు జిల్లా స్థాయి సదస్సు

అద్దంకిటౌన్, జనవరి 8: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్‌ఆర్ కాంత్రి పథం కార్యాలయంలో యువత ఉద్యోగ ఉపాధి నైపుణ్యాభివృద్ధి అవకాశాలు-సవాళ్ళపై జిల్లా స్థాయి సదస్సు జరుగుతుందని రిసోర్స్ సెంటర్ బాపట్ల రిజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. అద్దంకి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

రోటరీ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ పేపర్ల అందజేత

అద్దంకిటౌన్, జనవరి 8: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పలు ఉన్నత పాఠశాలలలోని పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేశారు. మండలంలోని శంఖవరప్పాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోము రమణారెడ్డి సౌజన్యంతో మోడల్ టెస్ట్ పేపర్లు అందజేశారు. అలాగే, మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాలం హనుమారెడ్డి సౌజన్యంతో మోడల్ టెస్ట్ పేపర్లు అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు నర్రా శ్రీలక్ష్మి, హెచ్‌ఎం శ్రీనివాసులు, నాగభూషణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

అద్దంకిటౌన్, జనవరి 8: ప్రభుత్వ పాఠశాలకు దాతలు అందించే సహాయ సహకారాలు మరువలేనివని హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన గొట్టిపాటి శ్రీనివాసరావు మధ్యాహ్నం భోజనానికి ఉపయోగపడేలా గ్రైండర్‌ను అందజేశారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు కుంచాల విజయలక్ష్మి ప్లేట్‌లు, గ్లాసులు నిల్వ ఉంచే స్టీల్ స్టాండ్‌లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగులమూడి నగేష్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

14న మండలస్థాయి ముగ్గుల పోటీలు

అద్దంకిటౌన్, జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని వేలమూడుపాడు గ్రామంలో ఈనెల 14న రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, వేలమూరిపాడు గ్రామ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు జరుగుతాయని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేది రాత్రి 9 గంటలలోపు తమ పేర్లను అద్దంకిలోని ఆకృతి స్కిల్స్, నవయుగ స్వీట్స్, కావ్య మెస్‌లలో తమ పేర్లను స్వయంగా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 93477 74141, 9866738093 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కాలనీల్లో అన్నిరకాల మౌలిక వసతులు



కాలనీలో ముఖద్వారం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి, జనవరి 8: జగనన్న కాలనీలలో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. అద్దంకి పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులో జగనన్న కాలనీ వద్ద ముఖద్వారం నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా కాలనీలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, కమిషనర్ శ్రీనివాసులు, వైస్‌చైర్మన్‌లు దేసు పద్మేష్, అనంతలక్ష్మి, పలువురు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు.. పంగులూరు, జనవరి 8: పార్టీలకతీతంగా అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు మంజూరుచేస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి అన్నారు. పంగులూరు స్థానిక మార్కెట్ యార్డ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో నూతన లబ్దిదారులకు హనిమిరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, ఎంపీడీవో రామాంజనేయులు, పులికం కోటిరెడ్డి, ప్రసాదరెడ్డి, పలువురు నేతలు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన కృష్ణచైతన్య

పంగులూరు, జనవరి 8: పంగులూరు మండలంలో శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య సోమవారం పర్యటించారు. మండలంలోని కోటపాడు గ్రామంలో అనారోగ్యంతో వైద్య చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు భవనం బ్రహ్మారెడ్డిని పరామర్శించారు. అనంతరం కొండమంజులూరు గ్రామంలో మృతి చెందిన సందిపాగు సంతోషమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులైన సర్పంచ్ కొలకలూరి ప్రభాకర్, ఎంపీటీసీ సుప్రియను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైసీపీ మండల కన్వీనర్ ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఆర్వీ సుబ్బారావు, సుభాని, బొప్పూడి వెంకన్నబాబు, జంపని రాజేష్, సుందరరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

అనుమతులు లేని లేఅవుట్‌లలో రాళ్ల తొలగింపు

అద్దంకిటౌన్, జనవరి 8: ఎటువంటి అనుమతులు తీసుకోకుండా పొలంలో లే అవుట్‌లు వేయడంతో మంగళవారం గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు పరిశీలించి తొలగించారు. చక్రాయపాలెం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో ఎటువంటి అనుమలు తీసుకోకుండా అక్రమంగా లే అవుట్ వేశారు. మంగళవారం అక్రమంగా వేసిన రాళ్లను సిబ్బందితో కలిసి తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వీఆర్వో జ్యోతిరావు తెలిపారు. గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోకుండా అక్రమ లే అవుట్‌లు వేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

వేటపాలెం(చీరాల), జనవరి 8: రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని డీపీఎం వాణిశ్రీ చెప్పారు. మండలంలోని దేశాయిపేట పంచాయతీ ఆర్‌బీకే-4లో సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఏవో కాశీవిశ్వనాథ్, ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతి సేద్యం ఉత్పత్తులను సమాఖ్యల స్టాల్స్‌లో విక్రయించేవిధంగా ప్రోత్సహించే అవకాశాలను కూడా వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేత

ఇంకొల్లు, జనవరి 8: ఇంకొల్లు నివేదిత స్కూల్‌లో ఆంగ్ల బాష సామర్థ్యంపై ప్రిన్సిపాల్ పి.సుధాకర్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జి.సుబ్బారావు, అకడమిక్ డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

చినగంజాం, జనవరి 8: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకూరి పుల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన బాలబాలికలు శిక్షణ అనంతరం కర్నూలు జిల్లా పంద్యాలలో ఈనెల 20 నుంచి 23 వరకు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.